ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శనివారం 28 జూన్ 2025

80 మందితో రొట్టెల పండుగ ఉత్సవ కమిటీ

నెల్లూరు (సాంస్కృతికం) : వచ్చే నెల 6న మొదలయ్యే బారాషహీద్ దర్గా రొట్టెల పండుగలో భక్తులకు సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 80 మందితో జంబో కమిటీ వేసింది. ఆ మేరకు ఉత్తర్వులు జిల్లా కేంద్రానికి వచ్చాయి. కమిటీ ఛైర్మన్‌గా 32వ డివిజన్‌కు చెందిన ఖాదర్‌బాషా నియమితులవగా, ఉపాధ్యక్షులుగా సయ్యద్ రబ్బానీ, షేక్.కమలుద్దీన్, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్‌నసూద్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా షేక్.ఉమర్‌ఫరూక్, సయ్యద్ అజాద్ జమీర్, షేక్.రఫీ, సయ్యద్‌ఖాదర్, కార్యదర్శులుగా ఖలీల్ అహ్మద్ గులామ్, హుసేన్‌మాలిక్, షేక్.దావూద్, షేక్.దస్తగిరిలతోపాటు మరో 68 మంది కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు.

విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యం

జులై 5న మెగా పేరెంట్, టీచర్ మీటింగ్



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడంతోపాటు సహృద్భావ వాతావరణం కల్పించేందుకు పాఠశాల విద్యాశాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పాఠశాలల్లో ఉత్తమ విద్య అందించేందుకు, అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేసేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను ఒకే వేదికపైకి చేర్చనుంది. విద్యాపరమైన అంశాలను చర్చించడంతోపాటు ఆటపాటలు, సహపంక్తి భోజనాలు, పిల్లల ప్రగతి నివేదికలు అందచేయనున్నారు. పిల్లల ఉచిత, నిర్బంధ విద్యాహక్కు చట్టం, జాతీయ విద్యావిధానం, విద్యా పురోగతి కోసం ప్రజల భాగస్వామ్యం, తల్లిదండ్రుల పాత్ర తదితర అంశాలపై జులై 5వతేదీన మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ (మెగా పీటీఎం 2.0)ను నిర్వహించేందుకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

- వివరాలు 8లో..

అన్నదాత సుఖీభవ జేఎల్‌పీఎంకు ప్రత్యేక డ్రైవ్ : జేసీ

నెల్లూరు(హరనాథపురం), జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకానికి అవసరమయ్యే జాయింట్ ల్యాండ్ పార్సిల్ మ్యాప్ (జాయింట్ ఎల్‌పీఎం) పూర్తిచేయడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్షించారు. రెండవ విడత ఎంపికైన గ్రామాల్లో రీసర్వే సక్రమంగా పూర్తి చేయాలని, ఇప్పటి వరకు పూర్తయిన గ్రామాల్లో తలెత్తిన సమస్యలను పరిగణలోకి తీసుకుని మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు. రీసర్వేలో 22-ఏ, పీజీఆర్‌ఎస్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సంబంధిత చట్టపరమైన విషయాల నిర్వహణను క్రమబద్ధీకరించడానికి రూపొందించిన ఓఆర్‌సీఎంఎస్‌ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఐవీఆర్‌ఎస్ కాల్స్ ద్వారా ప్రజాభిప్రాయం ఎప్పటికప్పుడు సేరిస్తున్నారన్నారు.

ఇంకెన్నాళ్లీ కష్టాలు?

ఆశించిన స్థాయిలో సాగని ఫ్లైవోవర్ల నిర్మాణ పనులు

బుజబుజనెల్లూరు, గొలగమూడి క్రాస్ రోడ్డు వద్ద అవస్థలు

డిసెంబరు నాటికి పూర్తి : ఎన్‌హెచ్‌ఏఐ పీడీ

నెల్లూరు నగర పరిధిలో జాతీయ రహదారిపై చేపట్టిన ఫ్లైఓవర్ల నిర్మాణ పనులు ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కు అన్నట్టుగా సాగుతున్నాయి. మొన్నటిదాకా ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని అనుకుంటే ఈ వంతెనల నిర్మాణం మొదలయ్యాక రెట్టింపయ్యింది. పోనీ ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని వేగంగా నిర్మాణాలు చేస్తున్నారా? అంటే అదీనూ లేదు. మొదట భూసేకరణ సమస్యతో కొన్నాళ్లు పనులు ప్రారంభం కాలేదు. తర్వాత కాంట్రాక్టర్ ఆలస్యం చేయడంతో మరికొన్నాళ్లు పనులకు మోక్షం లభించలేదు. ఆ తర్వాత ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు వెంట పడడంతో ఎలాగోలా పనులు మొదలయ్యాయి. అయితే ఇప్పుడు ఈ పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. దీంతో బుజబుజనెల్లూరు, గొలగమూడి క్రాస్ రోడ్డు జంక్షన్ల వద్ద రోజు రోజుకూ ట్రాఫిక్ సమస్య విపరీతమవుతోంది.

- వివరాలు 8లో..



కనుల పండువగా పాండవ జనన అలంకారం



నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని మూలాపేటలో ఉన్న శ్రీకృష్ణధర్మరాజులస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం హోమం, విశేష పూజలు, చప్పర ఉత్సవం, భగవద్గీత పారాయణ జరిగాయి. సాయంత్రం విశేష పూజలు, మూలవర్లకు పూలంగిసేవ జరిగాయి. అనంతరం పాండవ జనన అలంకారం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా మహాభారతం ప్రవచనం, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

వక్ఫ్ ఆస్తులకు భద్రత ఏదీ!?

జిల్లాలో వందల ఎకరాలు అన్యాక్రాంతం

ముస్లింల సంక్షేమానికి ఉపయోగపడాల్సిన ఆస్తులవి. నిరుపేద ముస్లిం పిల్లల ఉజ్వల భవితకు అండగా నిలవాల్సిన భూ ములు. మసీదులు, దర్గాల ఆలనా పాలనా చూసుకునేందుకు దాతలు ఇచ్చిన విలువైన సంపద. కాలం కరిగే కొద్దీ ఆ ఆస్తులంతా అ న్యాక్రాంతమైపోతున్నాయి. అధికారుల నిర్ల క్ష్య వైఖరి మూలంగా వందల ఎకరాల వక్ఫ్ ఆస్తులు మాయమైపోతున్నాయి. ఒక్క నెల్లూరు జిల్లాలోనే సుమారు వెయ్యి ఎకరాల వరకూ ఇతరుల చేతుల్లోకి వెళ్లిపోయాయంటే పరిస్థితి అర్థం చేసుకోవ చ్చు. కొన్ని దశాబ్దాల నుంచి వక్ఫ్ ఆస్తులను గుర్తిస్తూనే ఉన్నారు తప్ప వాటి ని రక్షించుకోవడంలో మాత్రం వి ఫలమవుతున్నారు. ఈ క్ర మం లో తొలిసారి రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సమావేశం శనివారం నెల్లూరులో జ రగనుంది. జిల్లాలోని వక్ఫ్ బోర్డు ఆస్తులపై చర్చించనున్నారు.

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లో వక్ఫ్ భూములుండగా, కొన్ని భూములు మసీదులకు, దర్గాలకు అనుబంధంగా ఉన్నాయి. వందల ఏళ్ల నుంచి దాతలు ఇచ్చిన ఆస్తులుగా ఇవి రికార్డుల్లో నమోదై ఉన్నాయి. గతంలో సర్వే నిర్వహించిన అధికారులు జిల్లాలో సుమారు రెండు వేల ఎకరాల వరకూ వక్ఫ్‌బోర్డు భూములున్నట్లు గుర్తించారు. అందులో దాదాపు మూడొంతులకుపైగా ఇతరుల ఆధీనంలో ఉన్నట్లు తేల్చారు. వక్ఫ్ స్వాధీనంలో కేవలం 208 ఎకరాలు మాత్రమే ఉంది. ప్రభుత్వ అవసరాలకు 31 ఎకరాలను వినియోగించుకోగా, మరో 112 ఎకరాలకు సంబంధించిన వివాదం వివిధ కోర్టుల్లో నడుస్తోంది. ఒక్క నెల్లూరులోని పొగతోట, మాగుంట లేఅవుట్, సరస్వతీ నగర్, ఫత్తేఖాన్‌పేటతోపాటు మరికొన్ని ప్రాంతాల్లో 150 ఎకరాలు వక్ఫ్ ఆస్తులు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో 90 శాతం వరకూ భూముల్లో ఐదారు దశాబ్దాల నుంచి నివాసాలు ఉన్నాయి. కొంతమేర మాత్రమే ప్రస్తుతం వక్ఫ్ బోర్డు ఆధీనంలో ఉంది. జిల్లావ్యాప్తంగా ఆక్రమణకు గురైన భూముల విలువ రూ.కోట్లలో ఉంటుంది.

● నేడు సమావేశం..

అన్యాక్రాంతమైనట్లు అధికారుల దృష్టికి వచ్చాక ఆ భూముల్లో బోర్డులు పెట్టడమో లేదా ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వడమో చేసి సరిపెడుతున్నారు తప్ప వాటిని స్వాధీనం చేసుకునే ప్రయత్నం జరగడం లేదన్న విమర్శలు ఉన్నాయి. రాష్ట్రస్థాయిలో ఈ ఆక్రమణలపై కఠిన నిర్ణయాలు తీసుకుంటే తప్ప వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించుకోవడం సాధ్యపడదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితుల్లో జిల్లాకు చెందిన షేక్ అబ్దుల్ అజీజ్ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్‌గా ఉన్నారు. సాధారణంగా బోర్డు సమావేశాలన్నీ రాష్ట్ర కార్యాలయంలోనే జరుగుతుంటాయి. కానీ తొలిసారి ఈ సమావేశాలను జిల్లాల్లో నిర్వహించాలని అజీజ్ నిర్ణయించారు. అందులో భాగంగా తొలిసారిగా నెల్లూరులో బోర్డు సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నారు. అజీజ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో సభ్యులైన ఎమ్మెల్సీ రూహుల్లా, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, ప్రకాశం కలెక్టర్ తమీమ్ అన్సారియాతోపాటు ఇతర సభ్యులు పాల్గొననున్నారు. నెల్లూరు కార్పొరేషన్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగే సమావేశం అనంతరం వారంతా బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగ ఏర్పాట్లను పరిశీలిస్తారు. అనంతరం నెల్లూరు నగరంలోని పలు వక్ఫ్‌బోర్డు ఆస్తులను సందర్శిస్తారు.

ఆక్రమణకు గురైన వక్ఫ్ ఆస్తులు

ప్రాంతం	ఎకరాలు
ఉదయగిరి	340
నెల్లూరు	150
కావలి	140
వరికుంటపాడు	96
చేజర్ల	96
వింజమూరు	95
సూళ్లూరుపేట	94
జలదంకి	92
ఏఎస్‌పేట	91
కోవూరు	78
కలువాయి	74
అల్లూరు	69
సీతారామపురం	64
రాపూరు	58
బుచ్చి	53
ఆత్మకూరు	45
అనంతసాగరం	32
చిల్లకూరు	27
కలిగిరి	24
టీపీ గూడూరు	22
మర్రిపాడు	19
కోట	18
పొదలకూరు	13
వెంకటాచలం	13
కొండాపురం	11
సంగం	11
దగదర్తి	9
వాకాడు	9
కొడవలూరు	7
సైదాపురం	4
విడవలూరు	2

పాఠశాలల ఉన్నతికి నిధులు విడుదల

- 46 పీఎంశ్రీ పాఠశాలల్లో 6 అంశాల్లో పనులు
- 470 ప్రైమరీ మోడల్ స్కూళ్లలో అదనపు గదులు
- రూ.2.5 కోట్లతో 10 కేజీబీవీల్లో పలు అభివృద్ధి పనులు
- పాఠశాలల నిర్వహణకూ నిధులు విడుదల
- సమగ్ర శిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య

నెల్లూరు(విద్య), జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగం ఉన్నతిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు పీఎంశ్రీ పాఠశాలలకు, పాఠశాలల నిర్వహణకు, ప్రైమరీ మోడల్ స్కూల్స్‌లో అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేసిందని సమగ్రశిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య తెలిపారు. నగరంలోని జిల్లా విద్యాశాఖలోని ఎస్‌ఎస్‌ఏ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాలో పీఎంశ్రీ పాఠశాలలు 46 ఉండగా, వీటిలో ఆరు అంశాలకు సంబంధించి జరుగుతున్న పనులకు నిధులు విడుదలైనట్లు చెప్పారు. 11 పాఠశాలల్లో కెమిస్ట్రీ ల్యాబ్‌ల నిర్మాణానికి ఒక్కో దానికి రూ.15.58 లక్షల అంచనాలతో పనులు ప్రారంభించగా రూ.13.24 లక్షలు విడుదలైనట్లు తెలిపారు. అలాగే 36 పాఠశాలల్లో క్రీడామైదానాల అభివృద్ధికి ఒక్కోదానికి రూ.5లక్షల అంచనాలతో పనులు ప్రారంభించగా రూ.4.25 లక్షలు విడుదల చేశారన్నారు. వీటితోపాటు 20 పాఠశాలల్లో రామ్స్ అండ్ రైల్స్ ఏర్పాటుకు ఒక్కొక్క దానికి రూ.1.06 లక్షలు విడుదల చేశారన్నారు. 3 పాఠశాలల్లో లైబ్రరీల ఏర్పాటుకు ఒక్కోదానికి రూ.23.10 లక్షలు అవసరం కాగా రూ.19.64 లక్షలు విడుదల చేశారన్నారు. 33 పాఠశాలల్లో కిచెన్‌గార్డెన్స్‌కు ఒక్కొక్కదానికి రూ.1.5 లక్షలు అవసరం కాగా రూ.1.27 లక్షలు విడుదల చేశారన్నా రు. వీటితోపాటు 27 పాఠశాలల్లో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్‌కు ఒక్కో దానికి రూ. లక్ష అవసరం కాగా తొలి విడతగా రూ.85వేలు చొప్పున విడుదలయ్యాయన్నారు. ఈ నిధులతో పనులను వేగవంతం చేసి ఆగస్టు నాటికి పూర్తి చేస్తామని తెలిపారు.

ప్రైమరీ మోడల్ స్కూల్స్‌లో అదనపు గదులు

జిల్లాలోని 470 ప్రైమరీ మోడల్ స్కూల్స్‌లో అవసరమైన చోట అదనపు తరగతి గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు ఏపీసీ తెలిపారు. మొత్తం 1270 గదులు అవసరమని గుర్తించామని, అన్నింటినీ తాత్కాలిక పద్ధతుల్లో నిర్మాణాలు చేపట్టి ముందు వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. అనంతరం శాశ్వత నిర్మాణాలు చేపడతారని తెలిపారు. అలాగే జిల్లాలోని 10 కేజీబీవీల్లో రూ.2.5 కోట్లతో పలు అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని 2,571 పాఠశాలల నిర్వహణకు రూ.5,77,80,000 అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా, తొలివిడతగా రూ.2,88,90,000 (50 శాతం) నిధులు విడుదల చేశారన్నారు. అలాగే జిల్లావ్యాప్తంగా విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ జరుగుతోందని, జులై 12వతేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో బడిఈడు పిల్లలను బడిలో చేర్పించడమే లక్ష్యంగా సీఆర్‌పీ, అంగన్‌వాడీ, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీసులు నిత్యం గ్రామాల్లో తిరుగుతున్నారన్నారు. జిల్లాలో 14,232 మంది పిల్లలు బడిబయట ఉన్నట్లు గుర్తించామని, వీరందరినీ బడిలో చేర్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు.

భక్తుల కొంగుబంగారం కలిగిరమ్మ

రేపటి నుంచి తిరుణాళ్ల ● 3 గ్రామాల్లో గ్రామోత్సవాలు

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ

- 30లోగా పేర్లు నమోదు చేసుకోవాలి
- పరిశ్రమల శాఖ జీఎం మారుతీ ప్రసాద్

8లో..

అహా.. మాకేంటి!?

- కార్గో పార్శిళ్ల స్వీకరణలో ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ల తీరిది
- నగదు ఇవ్వకుంటే అంతే!
- ఫిర్యాదు చేస్తే 'కార్గో' సిబ్బంది వింత సమాధానాలు
- కొరవడిన ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ

నగరంలో ఉంటున్న గోపి తన సొంతూరికి పార్శిల్ పెట్టేందుకు ఉదయాన్నే ఆర్టీసీలోని కార్గో వద్దకు వచ్చాడు. పార్శిల్‌ను తూకం వేసిన సిబ్బంది రూ.100 అవుతుందని చెప్పడంతో అంతా చెల్లించాడు. అయితే, ఆ ఊరికి వెళ్లే బస్సులో మీరే పార్శిల్ వేసుకోవాలని సూచించడంతో మధ్యాహ్నం వరకు బస్టాండులోనే వేచి ఉండాల్సి వచ్చింది. తీరా బస్సు రావడంతో పార్శిల్‌ను డ్రైవర్‌కు ఇచ్చాడు. తనకేంటని అడగడంతో చేసేదిలేక రూ.100 సమర్పించుకున్నాడు.

ఓ వ్యాపారి తన వద్ద ఉన్న వస్తువులను విజయవాడకు పంపాల్సి వచ్చింది. దీంతో పార్శిల్ చేసి, కార్గో వద్దకు వెళ్లాడు. బరువు అంతా చూసి నగదు చెల్లించాడు. అయితే, పార్శిల్ మాత్రం వ్యాపారినే వేసుకోమని అక్కడున్న సిబ్బంది చెప్పాడు. దీంతో బస్సు వద్దకు వెళ్లగా రూ.200 ఇస్తేనే పార్శిల్ తీసుకుంటామని చెప్పడంతో చేసేదిలేక అంత ఇచ్చుకోవాల్సి వచ్చింది.

ఏపీఎస్ ఆర్టీసీ కార్గో విభాగంలో జరుగుతున్న తీరిది. సహజంగా కార్గోలో వస్తువులు, కవర్లు బుక్ చేసుకున్న సమయంలో ఉద్యోగులు పార్శిళ్లను ఆయా డి పోలకు చెందిన ఆర్టీసీ బస్సుల్లో వేయాలి. అయితే ఇందుకు భిన్నంగా కార్గో సిబ్బంది పార్శిల్ బుక్ చేసిన వెంటనే 'మీకు అర్జెంటా అయితే నేరుగా బస్సు వద్దకు వెళ్లి పార్శిల్స్ ఇచ్చుకోండి.' అని చెబుతున్నారు. కొన్ని ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో తాము పార్శిళ్లను ఆ బస్సుల్లో ఇవ్వలేము. మీరే ఇచ్చుకోవాలి.' అని చెబుతున్నారు. దీంతో పార్శిల్స్ బుక్ చేసుకున్న వారికి తిప్పలు తప్పడం లేదు.



● తప్పని వ్యయప్రయాసలు

ఆర్టీసీ కార్గోలో వస్తువులు బుక్ చేసుకునే ప్రజలు ఆ వస్తువు, కవర్ పార్శిల్ ఆధారంగా వాటి బరువు, ప్రాంతాన్ని బట్టి కిలోమీటర్ల ఆధారంగా రుసుము చెల్లించాలి. ఈ క్రమంలో కార్గోలో వస్తువును బుక్ చేసుకున్న వారు అక్కడే ఆ వస్తువులను ఇచ్చి వెళ్లిపోతారు. అయితే కొన్ని ప్రాంతాలకు కార్గోలో వస్తువులు బుక్ చేసిన సిబ్బంది 'చిన్న కవర్లు కాబట్టి మీరే బస్సులో ఇచ్చుకోండి.' అంటూ ఉచిత సలహా ఇస్తున్నారు. ఆ బస్సుల కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది. మరోవైపు పార్శిల్ తీసుకోవాలంటే తమకేంటి అని డ్రైవరు, కండక్టర్లు ఎదురు ప్రశ్నిస్తున్నారు. దీంతో ఎంతోకొంత వారికి సమర్పించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకవేళ అడిగినంత ఇవ్వకపోతే పార్శిల్‌ను బస్సుల్లో పెట్టేందుకు నిరాకరిస్తున్నారు. కార్గోలో నగదు చెల్లించిన రశీదు ఉందని చెప్పినా ససేమీరా అంటున్నారు.

● మా మాట వినరు సర్!

కార్గోలో నగదు చెల్లించి ప్రజలు పార్శిల్స్ పంపేందుకు సిద్ధమవుతుంటే ఆర్టీసీలోని కొంతమంది డ్రైవర్లు, కండక్టర్ల తీరు విమర్శలకు తావిస్తోంది. చేయి తడిపితే తప్ప వారు పార్శిలు తీసుకోవడం లేదు. 'మీకు ఎందుకు ఇవ్వాలి. అక్కడ కార్గోకు నగదు ఇచ్చాం కదా!' అని ప్రశ్నిస్తుంటే అయితే వారితోనే మాట్లాడుకోండి. మేము తీసుకువెళ్లం' అంటూ కరాఖండీగా చేప్పేస్తున్నారు. దీంతో ప్రజలు నేరుగా కార్గో పాయింట్ వద్దకు వెళ్లి సిబ్బందికి ఫిర్యాదు చేస్తే వారి నుంచి కూడా సరియైన సమాధానం రావడం లేదు. 'ఏం చేద్దాం సర్.. వారు మా మాట వినరు. తక్కువ బరువున్న వస్తువులను వారు తీసుకు వెళ్లాలంటే డబ్బు ఇచ్చుకోవాలి.' అంటూ ఉచిత సలహా ఇస్తున్నారు. ఇదెక్కడి న్యాయమని ప్రశ్నిస్తే వారికి నగదు ఇవ్వాల్సిందే మాకు ఒక్క పార్శిల్‌కు వచ్చేది రూ.5 మాత్రమే వారు అంత తక్కువ నగదుకు తీసుకు వెళ్లరని సమాధానం ఇస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పార్శిల్ రవాణాలో తలెత్తుతున్న ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

డీఎంలకు ఫిర్యాదు చేయచ్చు

ఆర్టీసీ కార్గోకు సంబంధించిన ఫిర్యాదులు ఉంటే సంబంధిత డిపో మేనేజర్లకు ఫిర్యాదు చేయండి. కార్గోలో వస్తువులు బుక్ చేసుకున్న తర్వాత ఎవరికీ నగదు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎవరైనా అడిగితే నేరుగా డీఎంలకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాము.

- షమీమ్, డిప్యూటీ సీటీఎం

- నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి)



ఆర్టీసీ ప్రధాన బస్టాండు ఆవరణలో కార్గో పాయింట్

సమగ్ర శిక్షలో బదిలీలకు దరఖాస్తులు

నెల్లూరు(విద్య), జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో పనిచేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల బదిలీలకు దరఖాస్తుల ప్రక్రియ పూర్తయింది. సీనియారిటీ జాబితాను వెబ్‌సైట్‌లో, నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచారు. వీటిపై అభ్యంతరాలు స్వీకరించి, పరిష్కరించిన తరువాత శనివారం తుది జాబితాను ప్రకటిస్తామని ఏపీసీ వెంకట సుబ్బయ్య తెలిపారు. జిల్లాలో సీఆర్‌ఎంటీలు 9, ఐఈఆర్‌పీలు 4, కేజీబీవీ సిబ్బంది 5, మండలస్థాయి అకౌంటెంట్‌లు 2, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లు 4, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్‌లు 4, ఫిజికల్ అండ్ హెల్త్ విభాగంలో 5, వర్క్ ఎడ్యుకేషన్‌లో ఐదుగురు, అంతర్‌జిల్లాకు ముగ్గురు కలిపి మొత్తం 41 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వీరందరికీ ఈ నెల 30 నుంచి జులై 2వతేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహించి స్టేషన్ పాయింట్ల వారీగా నిబంధనలను అనుసరించి బదిలీలు చేపడతామన్నారు. 5న ఎస్‌పీడీకి నివేదించి ఉత్తర్వులు వచ్చిన వెంటనే అందచేస్తామని తెలిపారు.

కందుకూరులో ఆక్రమిత స్థలం పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కందుకూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) :పామూరు రోడ్డులోని ప్రశాంతి కాలనీ సమీపంలో సర్వే నెంబరు 122/1 లో కబ్జాదారులు చదును చేసిన ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ సిబ్బంది శుక్రవారం పరిశీలించారు. రూ. కోట్లు విలువ చేసే 1.75 ఎకరాల స్థలంపై కబ్జాదారుల కన్నేసిన వైనంపై 'ఖాళీ జాగా.. వేసేస్తాం పాగా' శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో వీఆర్వో ఉదయ భాస్కర్, సర్వేయర్ ఆ స్థలాన్ని పరిశీలించారు. రికార్డుల్లో అది ప్రభుత్వ భూమిగా ఉండటమే కాగా గతంలో మున్సిపాలిటీ నిధులతో లెవెలింగ్ చేసి అభివృద్ధి చేసి ఉన్నట్లు గుర్తించామని వారు తెలిపారు. అయితే కొందరు తమకు పట్టాలు ఉన్నాయని చెబుతున్నారని, దీనిపై తహసీల్దారుకు నివేదిస్తామని తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.



మొహర్రం నెల ప్రారంభం

ముస్లింల పవిత్ర ప్రార్థనలు

రొట్టెల పండుగకు జెండా ప్రతిష్ఠ

దర్గాలో భక్తుల సందడి

- వివరాలు 8లో..

1న వితంతు పింఛన్ల మంజూరు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 27(ఆంధ్రజ్యోతి) : జిల్లాకు కొత్తగా మంజూరైన 3,680 వితంతు పెన్షన్లను జులై 1వ తేదీన పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. పాత పెన్షన్లు 74,994 ఉండగా, పాత, కొత్త మొత్తం 77,674 వితంతు పెన్షన్లను మంగళవారం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వండి

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఇళ్ల నుంచి తడి, పొడి చెత్త వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందజేసి సహకరించాలని ఎంపీడీవో నారాయణరెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని రేబాలలో పలు ఇళ్ల వద్దకు వెళ్లి తడి, పొడి చెత్తలను పారిశుధ్య కార్మికులకు అందజేసే విధానం, ఐవీఆర్ఎస్ కాల్స్‌పై అవగాహన కల్పించారు. ఇళ్ల ముందు ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి దానిని సంరక్షించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసులు, సర్పంచు భాగ్యలక్ష్మి, సెక్రటరీ, సిబ్బంది పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9226
వెండి కిలో ధర	రూ. 108100
వెండి ఒక గ్రాము	రూ. 111.10

ప్రతి సమస్య పరిష్కరిస్తాం

● ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



నెల్లూరులోని ఎమ్మెల్యే నివాసంలో బుచ్చి అర్బన్ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసులు, రామానాయుడు, కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : బుచ్చి నగర పంచాయతీలోని అన్ని వార్డులతోపాటు 9వ వార్డు పరిధిలో ప్రతి సమస్యను పరిష్కరిస్తామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. ఆ వార్డులో కొత్తగా నియమించిన టీడీపీ కమిటీ సభ్యులు, నాయకులు శుక్రవారం నెల్లూరులోని ఎమ్మెల్యే నివాసంలో బుచ్చి అర్బన్ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసులు, 9వార్డు టీడీపీ నాయకుడు వింజం రామానాయుడు, కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ వార్డు పరిధిలోని శాంతినగర్, కనిసిరిపాళెం ప్రాంతాల్లోని పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు.

మహిళల అభ్యున్నతికి అనేక పథకాలు

● మెప్మా పీడీ లీలారాణి

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల మహిళల అభ్యున్నతికి, వారిని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తోందని మెప్మా పీడీ లీలారాణి అన్నారు. శుక్రవారం బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కార్యాలయంలో మెప్మా టీఎల్ఎఫ్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కమిషనర్ బాలకృష్ణతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొదుపు సంఘాల మహిళలకు, ఆర్పీలకు పలు సూచనలు ఇచ్చారు. బుచ్చి పట్టణంలో తృప్తి క్యాంటిన్ ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేస్తున్నామని పీడీ తెలిపారు. ఇప్పటికే కమిషనర్ స్థలాన్ని కూడా గుర్తించినట్టు తెలిపారు. క్యాంటిన్ ఏర్పాటుకు సభ్యులను కూడా గుర్తించి వారికి రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంఎం అంకయ్య, సీవో నర్మద, ఆర్పీలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.



మెప్మా పీడీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నగర పంచాయతీ చైర్‌పర్సన్ సుప్రజ

ముదివర్తిలో పారిశుధ్యానికి పాతర!

● రోడ్లపైనే మురుగు నీరు ● పట్టించుకోని పాలకులు, అధికారులు ● అవస్థలు పడుతున్న ప్రజలు





ముదివర్తిలో రోడ్లపై నిల్వ చేరిన మురుగు నీరు

విడవలూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముదివర్తి గ్రామంలో అధికారులు పారిశుధ్యానికి పాతర వేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాలను పరిశుభ్యంగా ఉంచాలని వివిధ కార్యక్రమాలను అమలు పరుస్తుంటే అధికారులు మాత్రం వాటని నామమాత్రంగా నిర్వహిస్తు గ్రామాలను గాలికి వదిలేస్తున్నారు. మండలంలో మేజరు పంచాయతీ అయిన ముదివర్తిలో ఏవైపు చూసినా పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కనపడుతోంది. పంచాయతీలోని దళిత కాలనీలో సక్రమంగా మురుగు కాలువలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లమీద పారుతూ చిన్నపాటి కొలనులను తలపిస్తున్నాయి. మురుగుకాలువలను నిర్మించాలని గ్రామస్థులు ఎన్నిసార్లు ప్రజా ప్రతినిధులను వేడుకున్నా వారు పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో మురుగునీరు రోడ్లపై ఉండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా దోమల బెడదకి కాలనీవాసులు రోగాల బారిన పడుతున్నారు. గత కొన్ని నెలలుగా ఇబ్బందులు పడుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవటంలేదని కాలనీ వాసులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన జిల్లాధికారులు స్పందించి మురుగునీటిని తొలగించాలని ప్రజలు కొరుతున్నారు.

సమావేశాలకు అధికారుల డుమ్మా కొట్టడం తగదు



మాట్లాడుతున్న ఎంపీపీ పార్వతి

కోవూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : మండల సమావేశాలకు బాధ్యత కలిగిన అధికారులు డుమ్మా కొట్టడం తగదని ఎంపీపీ తుమ్మలపెంట పార్వతి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సమావేశానికి పలు శాఖల అధికారుల డుమ్మా కొట్టారు. దీనిపై ఎంపీపీ అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా పశుసంవర్ధకశాఖ అధికారులు చాలా కాలం నుంచి సమావేశాలకు గైర్హాజరవుతున్నారని చెప్పారు. దీంతో రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాలేకపోతున్నామన్నారు. గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలను శుభ్రపరచకుండానే బిల్లులు నమోదు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు చెప్పారు. ఉపాధ్యక్షుడు శివుని నరసింహులురెడ్డి మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులకు కాలనీవాసులు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో సీహెచ్ శ్రీహరిరెడ్డి, జడ్పీటీసీ కవరగిరి శ్రీలత మాట్లాడారు.

నగర పంచాయతీలో 6 నెలల లెక్కలు ఇవ్వండి

● కమిషనర్ కోరిన కౌన్సిలర్ ప్రమీలమ్మ

బుచ్చిరెడ్డిపాళె, జూన్ 27(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలో 2025 జనవరి 1నుంచి జూన్ 25 వరకు నగదు లావాదేవీల లెక్కలు ఇవ్వాలని 16వవార్డు కౌన్సిలర్ బిట్రగుంట ప్రమీలమ్మ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆమె కమిషనర్‌ను తన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. గడిచిన ఆరు నెలల కాలంలో జమైన జనరల్‌ఫండ్, బెజవాడ గోపాల్‌రెడ్డి, ఉక్కాల రాజేశ్వరమ్మ అండ్ బైనా హేమలతకాంప్లెక్స్ కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న షాపులకు వేలం పాటలకు సంబంధించి జమైన మొత్తం నగదు, షాపింగ కాంప్లెక్స్‌లోని షాపుల లీజుదారుల నుంచి వసూలు చేసిన అడ్వాన్సుల మొత్తం లిఖిత పూర్వకంగా ఇవ్వాలని కోరారు. ఆయా షాపుల నుంచి గత అజెండాలో వివరాల మేరకు జమైన అద్దె బకాయిలు, చెల్లించనివారిపై తీసుకున్న చర్యల వివరాలు కోరారు. అదే విధంగా పారిశుధ్యం, అజెండా వివరాల మేరకు తాగునీటి సరఫరా చేసే 32 మంది సిబ్బంది, మోటారు ఆపరేటర్లు 22మంది పేర్లు వివరాలు రాతపూర్వకంగా కోరుతూ నేడు జరగబోయే సాధారణ సభలో తెలియజేయాలని కోరారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న 16వార్డు కౌన్సిలర్ ప్రమీలమ్మ

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



డీఎల్‌పీఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ముత్తుకూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ ముత్తుకూరులోని పారిశుధ్య కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని డీ ఎల్పీఓ రమణయ్య, ఎంపీ డీవో నాగమణిలకు శుక్రవారం వినతిపత్రాలు సమర్పించారు. ఈసందర్భంగా సీ ఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు గడ్డం అంకయ్య మాట్లాడుతూ ముత్తుకూరు పంచాయతీలో పారిశుధ్య కార్మికులు గత 10 సంవత్సరాల నుంచి వివిధ రకాలైన పనులు చేస్తున్నారన్నారు. వారికి మేనెల జీతాలు జూన్ నెల పూర్తవుతున్నా చెల్లించలేదని, అధికారులను అడిగితే సరైన సమాధానం లేనందున డీఎల్పీఓ దృష్టికి సమస్యలను తీసుకెళ్లామన్నారు. ఆయన వెంటనే స్పందించి సంబంధిత పంచాయతీ సెక్రటరీ లను పిలిచి వారికి రావాల్సిన జీతాలు వెంట నే ఇవ్వాలని, వారి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారన్నారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులకు నేరుగా డబ్బులు ఇవ్వకుండా వారికి ప్రతి నెల బ్యాంక్ అకౌంట్లలో జమచేసి రికార్డు మెంటైన్ చేయాలన్నారు. యూని ఫామ్స్, మాస్కులు, సబ్బులు, నూనెలు అందించాలని, ఆదివారాలు సెలవులు ఇవ్వాలని కోరారు. పారిశుధ్య కార్మికులపై కాంట్రాక్టర్ల పెత్తనం ఉండకూడదని పంచాయతీ కార్యదర్శులు మాత్రమే పనిచేయించాలని కార్మి కులకు హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పారిశధ్య కార్మికులు నక్క మురళీ, బండ్ల ఆనందరావు, రాగయ్య, రాజశేఖర్, పుల్లయ్య, వెంకటేశ్వర్లు, వెంకయ్య, పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ముత్తుకూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అన్ని వసతులు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని ఈదూరు ఈశ్వ రమ్మ, జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యా యులు శుక్రవారం తల్లిదండ్రులకు అవ గాహన కల్పించారు. ముత్తుకూరు జడ్పీ ఉన్నత పాఠశాల మోడల్ పాఠశాలగా ఎంపిక చేసిన సందర్భంగా పరిసర గ్రామా ల్లో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయుల బృందం పర్యటించింది. ఈసందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వస తులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిం చారు. ప్రధానంగా గిరిజన దళిత కాలనీ లలో పర్యటించి పిల్లలకు విద్య వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. మోడల్ హై స్కూల్‌గా ఎంపికైన జడ్పీ పాఠశాలలో 1 నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రధానోపాధ్యాయు లు శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో రాష్ట్రానికి పూర్వ వైభవం

● ఎమ్మెల్యే సోమిరెడ్డి ● వీఎస్‌యూలో మెగా జాబ్‌మేళా



నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి. పక్కన రాజగోపాల్‌రెడ్డి, శృతిరెడ్డి

వెంకటాచలం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు, జాబ్ మేళాలతో రాష్ట్రానికి మళ్లీ పూర్వవైభవం వచ్చిందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో శుక్రవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సోమిరెడ్డి ఫౌండేషన్ సంయుక్తంగా మెగా జాబ్‌మేళా జరగింది. ఈసందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలను సోమిరెడ్డి అందజేసి, మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో పరిశ్రమలు, పెట్టుబడులు, ఐటీ కంపెనీలు రాష్ట్రానికి వస్తున్నాయన్నారు. ఏడాది పాలనలో రూ.6లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పలు కంపెనీలతో ఎంఓయూలు జరిగాయన్నారు రాష్ట్రవ్యాప్తంగా మళ్లీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ప్రారంభమయ్యే పరిస్థితి రావడం సంతోషదాయకమన్నారు. కృష్ణపట్నంలోని రిలయన్స్ భూముల్లో సోలార్ ప్యానెల్ తయారీ ప్లాంట్లు ఏర్పాటైతే చాలామందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు. మనుబోలులో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు కోసం 60 ఎకరాలకుపైగా భూములను గుర్తించామని, త్వరలో శంకుస్థాపన జరగబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజి స్ట్రార్ కే సునీత, సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సో మిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, శృ తిరెడ్డి, స్కిల్ డెవలప్మెంట్ అధికారులు పాల్గొన్నారు.

438 మంది ఉద్యోగాలకు ఎంపిక

ఈ జాబ్‌మేళాలో 34కుపైగా ప్రముఖ కంపెనీలు పాల్గొనగా, 1403 మంది యువతీ యువకులు తరలివచ్చారు. తొలివిడతలో 438 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. షార్ట్ లిస్ట్‌లో మరో 106 మంది ఎంపికైనట్లు సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు.

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

● వ్యాధులతో ప్రజల అవస్థలు ● పట్టించుకోని అధికారులు

వెంకటాచలం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం లోపించి దోమలు ప్రజలపై దండయాత్ర చేస్తున్నాయి. అక్కడక్కడ నీటి నిల్వలు పేరుకుపోవడం, పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేయకపోవడం, డ్రైనేజీ కాలువల్లో మురుగు నిలిచిపోవడం, ఖాళీ స్థలాల్లో పారిశుద్ధ్యం లోపించడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే టైఫాయిడ్, మలేరియా, చికున్‌గునియా వంటి వ్యాధుల బారినపడే ప్రమాదముందని ప్రజలు అందోళన చెందుతున్నారు. మండలంలోని పూడిపర్తి, సర్వేపల్లి, ఇడిమేపల్లి, రామదాసుకండ్రిగ, తాటిపర్తిపాళెం తదితర గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించడంతో దోమల బెడద విపరీతంగా ఉంది. ముఖ్యంగా పూడిపర్తిలో జనవాసాల మధ్య చెత్తనిల్వలు, డ్రైనేజీ కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, పూడికతో ఎక్కడికక్కడే మురికి నీరు నిలిచిపోయి దోమల సమస్య అధికంగా ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దోమల నివారణ దిశగా అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ మార్గదర్శకాలు ఉన్నా అవి అచరణకు నోచుకోవడం లేదు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి పారిశుధ్యం లోపించిన గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



పూడిపర్తిలో వ్యర్థాలు, పూడికతో పేరుకుపోయిన సైడ్ కాలువలలో నిలిచిన మురికి నీరు

శిథిలావస్థలో గిరిజన పాఠశాల

● బిక్కుబిక్కుమంటూ విద్యార్థులు



పాఠశాల శ్లాబ్ పెచ్చులూడి బయటపడిన చువ్వలు

మనుబోలు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల గ్రామమైన పల్లిపాళెంలోని ప్రభుత్వ గిరిజన పాఠశాల శిథిలావస్థకు చేరడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ ఉంటున్నారు. ఐదేళ్ళుగా పాఠశాల ఇదే దుస్థితిలో ఉంది. గత ప్రభుత్వం పాఠశాలను నాడు-నేడు కింద కనీసం మరమ్మతులు చేయలేదు. ఈ పాఠశాలలో ప్రస్తుతం 15మంది గిరిజన విద్యార్థులు చదువుకుం టున్నారు. కమ్ములు వేలాడుతూ, శ్లాబ్ పెచ్చులూడి దర్శనమిస్తోంది. ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందోనంటూ పిల్లలు, టీచర్ భయం భయంగా ఉంటున్నారు. మరో పక్క పాఠశాలతో పాటు మరుగుదొడ్డి సైతం అధ్వానంగా ఉంది. ఇప్పటికైనా గిరిజనశాఖ ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు మరమ్మతులు చేయాలని, లేకపోతే కొత్త పాఠశాలను నిర్మించాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

C.R.I.M.E N.E.W.S

బంగారం చోరీపై ప్రశ్నిస్తే రాళ్లతో దాడి

● అన్నదమ్ముళ్లకు తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న రాజకుమార్

బిట్రగుంట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బంగారం చోరీపై అనుమానంతో ఓ వ్యక్తిని ప్రశ్నించగా రాళ్లతో దాడి చేసిన ఘటన శుక్రవారం సాయంత్రం బోగోలు పంచాయతీ బేతనీపేటలో జరిగింది. వివరాల మేరకు.. బోగోలు పంచాయతీ బేతనీపేటలో నివసిస్తున్న రాజకుమార్ ఇంట్లో ఏసీ మరమ్మతులకు గురైంది. దానికి మరమ్మతులు చేసేందుకు అదే ప్రాంతానికి చెందిన ఏసీ మెకానిక్ షేక్.అఫ్రీద్ గురువారం సాయంత్రం వచ్చి మరమ్మతులు చేశాడు. కుటుంబ సభ్యులు బెడ్‌రూంలో ఏసీని ఆన్‌చేసి కూలింగ్ అవుతుందో లేదో చూస్తుండగా ఏసీ మెకానిక్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం ఇంటి హాలోని సోఫాలో ఉంచిన హ్యాండ్ బ్యాగ్‌ను చూసుకోగా అందులో ఉంచిన బంగారు గాజులు కనిపించలేదు. దీంతో మెకానిక్‌పై అనుమానంతో శుక్రవారం ఉదయం అతని ఇంటికి వెళ్లగా అతను లేకపోవడంతో సాయంత్రం రాజకుమార్, రజనీకుమారులు మరోసారి అతని ఇంటికి వెళ్లారు. హ్యాండ్ బ్యాగులో ఉంచిన బంగారు గాజులు గురించి ప్రశ్నిస్తుండగా వారిని తోసేసి వీధిలోకి పరుగుతీశాడు. అక్కడ దొరికిన రాళ్లతో అన్నదమ్ముళ్లపై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో అన్నదమ్ములిద్దరికి తీవ్రగాయాలవడంతో రక్షణ కోసం తిప్ప పోలీస్ స్టేషన్‌కి వెళ్లారు. అక్కడి నుంచి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108లో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ దాడి విషయమై విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ ప్రభాకర్ తెలిపారు.

అక్రమంగా తుమ్మచెట్లు నరికివేత



చెరువులో కూలీలతో తుమ్మచెట్లు నరికిస్తున్న అక్రమార్కులు

కలిగిరి, జూన్ 27(ఆంధ్ర జ్యోతి): మండలంలోని చిన అన్నలూరు చెరువులో అక్రమంగా తుమ్మ చెట్లు నరికివేతపై సర్పంచు రాగికుమారి భర్త ప్రసాద్, గ్రామస్థులు ఇరిగేషన్ ఏఈ శ్రీనాథ్ రెడ్డికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. వివరాల మేరకు.. చెరువులో తు మ్మచెట్లు అక్రమంగా కొట్టి వేస్తున్నారన్న సమాచారం మేరకు సర్పం చు వర్గీయులు చెరువులోకి వెళ్లి వారిని ప్రశ్నించగా అధికార పార్టీకి చెందిన నాయకుడికి తాము కొంత సొమ్ము ముట్టజెప్పి కొట్టుకుంటు న్నామన్నారని వారుతెలిపారు. ఈ విషయాన్ని ఏఈకి తెలియజేయగా ఏఈ అక్రమంగా తుమ్మచెట్లు నరికివేతపై కేసు నమోదు చేయిస్తామ ని హెచ్చరించగా కూలీలు వెళ్లిపోయారు. ఏఈ మాట్లాడుతూ మండలంలోని చెరువుల్లోని కలప రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రేమ విఫలంతో యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలమై మనస్థాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని శెట్టిగుంటరోడ్డు ఉడ్‌హౌస్ సంఘం ప్రాంతంలో నివసించే సాదా వెంకటేశ్వర్లు, వెంకట రమణమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు అశోక్(26) ఉన్నారు. అశోక్ ఓ యువతిని ప్రేమించి అది విఫలం కావడంతో ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. విషయం తెలుసుకున్న తండ్రి వెంకటేశ్వర్లు హుటాహుటిన కుమారుడిని రామచంద్రారెడ్డి వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. దీంతో ఆయన నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరి మృతి



మృతి చెందిన మాధవరెడ్డి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి రామాపురం గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఆంద్రావారిపల్లి గ్రామానికి చెందిన దాడి మాధవరెడ్డి మోటారుబైకుపై ప్రకాశం జిల్లా పామూరు నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. అదేక్రమంలో కడప జిల్లా ముద్దనూరు నుంచి కూరగాయల లోడుతో రాజమండ్రి వెళ్తున్న ఓ మినీ వ్యానుకు చెందిన ముందు వైపు టైరు బరస్ట్ కావడంతో మోటారుబైకును ఢీకొంది. దీంతో మాధవరెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ రఘునాథ్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరికి తరలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కత్తులతో బెదిరించి నగదు దోచుకున్న వ్యక్తుల అరెస్ట్



నిందితుల వివరాలు తెలుపుతున్న ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడి

నెల్లూరు(క్రైం), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిసై, జల్సాలకు అలవాటు పడి ఒంటరిగా ఉండే వ్యక్తులను కత్తులతో భయపెట్టి వారి వద్ద నుంచి నగదు దోచుకెళ్లే దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. నెల్లూరులోని నవాబుపేట పోలీసు స్టేషన్‌లో నిందితుల వివరాలను ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం మీడియాకు వెల్లడించారు. నగరంలోని నవాబుపేట ఎఫ్‌సీఐ కాలనీకి చెందిన బ్యాంకు ఉద్యోగి తన కుటుంబ సభ్యులతో కలిసి మోటారు సైకిల్‌పై ఈ నెల 25వ తేదీ రాత్రి 11.45 నిమిషాల సమయంలో ప్రయాణిస్తుండగా ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వెంబడించారు. ప్రధాన రైల్వే స్టేషన్ ఎదురుగా అడ్డగించి, కత్తులు చూపించి భయపెట్టి డబ్బు లాక్కున్నారు. అదే రోజు రాత్రి తడికల బజారు అరుంధతీవాడలో ఒంటరిగా ఇంటి బయట నిద్రిస్తున్న మహిళను అదే ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కత్తితో బెదిరించి డబ్బు లాక్కున్నారు. ఈ రెండు ఫిర్యాదులపై నవాబుపేట సీఐ వేణుగోపాల్‌రెడ్డి కేసులు నమోదు చేసి ప్రత్యేక బృందాలతో దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో శుక్రవారం ఉడ్‌హౌస్ సంఘం ప్రాంతానికి చెందిన యానం మునితేజ, చింతకాయల మహేష్‌కుమార్, బాలాజీనగర్‌కు చెందిన బొర్రా దేవకుమార్‌తోపాటు మరో ఇద్దరు బాల నేరస్థులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఐ రహిమాన్, సిబ్బంది బీవీ నరసయ్య, ఎస్ ప్రసాద్, టీ మస్తాన్‌రావు, డీ.సుధాకర్, ఎం.వేణు, జీ.మస్తానయ్య, ఎస్‌కే గౌస్‌బాషాను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	115
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	232

కోడిగుడ్ల ధర (100): 575



రాజరాజేశ్వరికి భక్తిశ్రద్ధలతో పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం రాహుకాల పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు రాహుకాల దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకారం జరిగింది. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్య క్రమాన్ని ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు. సాయంత్రం కుంభ హారతులు, పల్లకీసేవ కన్నుల పండువగా జరిగాయి.

సచివాలయాల్లో బదిలీల జాతర

- నేడు కార్పొరేషన్‌లో ఉద్యోగులకు కౌన్సెలింగ్
- బహిర్గతం కాని సీనియారిటీ జాబితా
- జాయినింగ్ తేదీల్లో గందరగోళం
- ఉద్యోగుల మధ్య రచ్చకు అవకాశం..?

నెల్లూరు నగరంలోని డివిజన్ సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులను బదిలీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కానీ ఉద్యోగులకు సంబంధించి సీనియారిటీ జాబితాను శుక్రవారం సాయంత్రానికి కూడా బహిర్గతం చేయలేదు. పలువురు ఉద్యోగుల జాయినింగ్ తేదీల్లో గందరగోళం ఉండటంతోనే సీనియారిటీ జాబితాను బయటపెట్టలేదని కొందరు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా నియామక ఉత్తర్వుల కంటే ముందే ఉద్యోగంలో చేరినట్లు కొందరు ఉద్యోగుల సర్వీస్ నమోదై ఉంది. ఇదే ప్రస్తుత గందరగోళానికి కారణమని సమాచారం.



పాత మున్సిపల్ కార్యాలయంలోని సచివాలయం

నెల్లూరు(సిటీ), జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో 2019లో వైసీపీ అధికారం చేపట్టాక గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను ఆ యేడాది అక్టోబరు 2న ప్రారంభించింది. కేటగిరీల వారీగా ఉద్యోగులను నియమించింది. అక్టోబరు 10వ తేదీన భారీ సభలు నిర్వహించి అప్పటి మంత్రులు, శాసన సభ్యులతో ఉద్యోగులకు నియామక పత్రాలు (ప్రొసీడింగ్స్) అందజేసింది. వారంతా 11వ తేదీ నుంచి ఉద్యోగాల్లో చేరాలని అధికారులు స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే జరిగింది. కానీ నెల్లూరు నగరంలో మాత్రం 83 మంది ఉద్యోగులు అక్టోబరు 2నే ఉద్యోగా ల్లో చేరినట్లు సర్వీస్ రిజిస్టర్‌లో నమోదు చేయించుకున్నారు. వాస్తవానికి వీరు కూడా ఆ యేడాది అక్టోబరు 10వ తేదీనే నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ప్రస్తుతం బదిలీల ప్రక్రియ మొదలవడంతో గురువారం రాష్ట్ర వ్యాప్త ఉద్యోగుల నియామక జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో సర్వీస్ రిజిస్టర్‌లో తేదీ మార్పు విషయం బయటకొచ్చినట్లు తెలిసింది.

నగర పరిధిలోనే బదిలీ...

నగరంలోని 54 మున్సిపల్ డివిజన్లకు 166 సచివాలయాలను ఏర్పాటు చేశారు. ఇందులో వివిధ విభాగాల కింద ఉద్యోగులను నియమించారు. వారిలో అడ్మిన్‌తోపాటు ఎడ్యుకేషన్, వెల్ఫేర్, అమినిటీస్, ప్లానింగ్, శానిటేషన్ సెక్రటరీలు మాత్రమే నగర పాలక సంస్థ పరిధిలోకి వస్తుండగా, మిగిలిన వీఆర్వో, ఆరోగ్యం, పోలీసు సెక్రటరీలు వారి వారి శాఖల పరిధిలోకి వస్తారు. కార్పొరేషన్ పరిధిలో పనిచేసే కార్యదర్శులు 996 మంది, ఇతర శాఖల వారు 498 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మిగిలిన శాఖల్లోని వారు జిల్లాలో ఎక్కడికైనా బదిలీ అయ్యే అవకాశం ఉండగా, కార్పొరేషన్ పరిధిలోని కార్యదర్శులు మాత్రం కార్పొరేషన్ పరిధిలోనే బదిలీ కావాల్సి ఉంటుంది. ఐదేళ్ల సర్వీసు పూర్తయిన వారిని తప్పనిసరిగా బదిలీ చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చింది. స్థానికతను పరిగణలోకి బదిలీ చేయాలని ఆదేశించింది. ఈ మేరకు మార్గదర్శకాలను నెల్లూరు నగర పాలక సంస్థకు పంపింది. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ కిందకు వచ్చే ఆరుగురు సచివాలయ కార్యదర్శులు నగరంలోని పలు డివిజన్లకు బదిలీ అయ్యే అవకాశాలున్నాయి. మిగిలిన శాఖల వారు మాత్రం జిల్లాలోని ఇతర ప్రాంతాలకు, బయటి ప్రాంతాల వారు నగరానికి బదిలీ అయ్యే చాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో కొందరు తాము కోరుకున్న చోటికి వచ్చేందుకు రాజకీయ సిఫార్సులతో సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది.

వెల్లడికాని సీనియారిటీ జాబితా

నెల్లూరులోని సచివాలయ ఉద్యోగులకు శనివారం బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అయితే శుక్రవారం సాయంత్రం వరకు సీనియారిటీ జాబితా ప్రకటించలేదు. ఆ జాబితా బయట పెట్టాలంటే ఉద్యోగుల జాయినింగ్ తేదీలను చూపాల్సి ఉంటుంది. అలా చేస్తే నియామక ఉత్తర్వులకంటే ముందుగానే జాయిన్ అయిన వారి వివరాలు బయటికొస్తాయని, దీని వల్ల సమస్యలు తలెత్తుతాయనే ఉద్దేశంతో జాబితాను వెల్లడించడం లేదని ఉద్యోగులు చెప్తున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి టీపీఆర్వో శ్రీలక్ష్మిని వివరణ కోరేందుకు ఫోన్ ద్వారా ప్రయత్నించగా ఆమె స్పందించలేదు. కాగా, సీనియారిటీ జాబితాను బయట పెట్టకపోవడం, జాయినింగ్ తేదీల్లో వ్యత్యాసాలు తదితర అంశాలపై శనివారం జరిగే కౌన్సెలింగ్‌లో రచ్చ జరిగే అవకాశం ఉంది.

న్యూస్ బాక్స్

కలెక్టరేట్, జడ్పీలోని వాహనాల వేలం : డీఆర్వో

నెల్లూరు(హరనాథపురం), జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్, నూతన జడ్పీ కార్యాలయాల్లో వాడుకలో లేని మారుతీ సుజుకీ, స్కార్పియో, ఇన్నోవా వాహనాలను వేలం వేయనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఉదయభాస్కర్ రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జూలై 3న ఉదయం 10.30గంటలకు జడ్పీ కార్యాలయంలో వేలం పాట జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల వారు రూ.10 వేలు దరవత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని, పూర్తి వివరాలకు కలెక్టరేట్‌లోని ప్రోటోకాల్ సెక్షన్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

నేత్రదానం



నెల్లూరు (వైద్యం), జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శెట్టిగుంట రోడ్డు ప్రాంతానికి చెందిన సాద అశోక్ (27) శుక్రవారం మరణించగా ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్ సునీల్ ఈ నేత్రాలను సేకరించారు. మృతుని కుటుంబ సభ్యులు వెంకటేశ్వర్లు, సుమన్‌కు గుర్తింపు పత్రాన్ని అందచేశారు.

వెలుగు సిబ్బంది కుటుంబాలకు ఆర్థిక సాయం



చెక్కును అందచేస్తున్న పీడీ నాగరాజకుమారి

నెల్లూరు(హరనాథపురం), జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మరణించిన వెలుగు సిబ్బంది కుటుంబ సభ్యులకు డీఆర్‌డీఏ-వెలుగు సిబ్బంది తమ ఒక రోజు జీతాన్ని సాయంగా అందించారు. ఈ మొత్తాన్ని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి ద్వారా శుక్రవారం ఆయా కుటుంబాలకు అందచేశారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ



ట్రై సైకిళ్లు అందజేస్తున్న ప్రశాంతిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ట్రై సైకిళ్లను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శుక్రవారం తన నివాసంలో పంపిణీ చేశారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఉన్నతాశయంతో ఈ కార్యక్రమం చేపట్టారని, ఇది నిరంతరం కొనసాగుతుందని ఆమె తెలిపారు.

నిత్యం ఇంటింటా చెత్త సేకరించాలి : ఎంపీడీవో



చెత్త సేకరణపై ఆరా తీస్తున్న ఎంపీడీవో

నెల్లూరు రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రతీ ఇంటి నుంచి నిత్యం చెత్త సేకరణ జరగాలని రూరల్ ఎంపీడీవో శైలేంద్రకుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని కాకుపల్లి పంచాయతీలో ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణ పనులు మెరుగ్గా నిర్వహించాలన్నారు. పారిశుధ్య నిర్వహణపై ప్రజలకు పంచాయతీ సిబ్బంది అవగాహన కల్పించాలని ఆదేశించారు.

కోర్టు కేసులు తగ్గించండి

- నగర కమిషనర్

నెల్లూరు(సిటీ), జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : సిటీ ప్లానింగ్ విభాగం నుంచి కోర్టుల్లో నడుస్తున్న కేసుల సంఖ్యను తగ్గించాలని కమిషనర్ నందన్ సూచించారు. శుక్రవారం సిటీ ప్లానింగ్ విభాగంపై సమీక్ష నిర్వహించారు. కేసులను తగ్గించడంతో పాటు ప్రతీ కేసుకు నిర్ణీత కాలంలో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు. చార్జిషీట్ ఆధారంగా కోర్టు జారీ చేసిన సమన్లను భవన నిర్మాణదారులకు అందించాలని చెప్పారు.



చిన్నారులతో కలిసి పార్కును ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ

30 వేల కుటుంబాలకు 6 లక్షల లీటర్ల మినరల్ వాటర్

- ప్రతీ ఇంటికి తాగునీటి కొళాయి
- ఇక నుంచి యంత్రాలతోనే రోడ్ల క్లీనింగ్
- మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలో 30 వేల పేద కుటుంబాలకు 6 లక్షల లీటర్ల నాణ్యమైన మినరల్ వాటర్‌ను అందించే దిశగా కసరత్తు చేస్తున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శుక్రవారం నగరంలోని 11వ డివిజన్‌లో రూ.50 లక్షలతో ఆధునీకరించిన చెరుకుతోట పార్కును చిన్నారులతో కలిసి ఆయన ప్రారంభించారు. సిటీలోని ప్రతీ కుటుంబానికి సురక్షిత తాగునీరు అందించాలన్న సంకల్పంతో పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ఎక్కడిక్కడ ఎన్టీఆర్ సుజల పథకం ద్వారా తాగునీటి ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో అమృత్ పథకం ద్వారా ప్రతీ ఇంటికి తాగునీటి కొళాయిని అందిస్తామని మంత్రి ప్రకటించారు. పొదలకూరు మండలం మహ్మదాపురం నుంచి నెల్లూరుకు తాగునీటిని గత ప్రభుత్వం లోనే రూ.550కోట్లు ఖర్చు చేసి తీసుకువచ్చామని చెప్పారు. సిటీ పరిధిలో 50 పార్కులు అందుబాటులోకి తీసుకురావాలని సంకల్పించి ఇప్పటికే 30 పార్కులను ఆధునీకరించినట్లు తెలిపారు. నగరంలో ఇక నుంచి రోడ్లను యంత్రాలతోనే శుభ్రం చేస్తారన్నారు. ఇందులో భాగంగా స్టోన్ హౌస్‌పేటలో నూతన స్వీపింగ్ యంత్రాలను ప్రారంభించారు. డెమో వాహనాన్ని నడిపి వాటి పనితీరును పరిశీలించారు. ఇప్పటి వరకు 28 యంత్రాలు ఉన్నాయని, ఇక నుంచి మాన్యువల్ స్వీపింగ్‌కు స్వస్తి పలుకుతున్నామని తెలిపారు. ఈ యంత్రాల ద్వారా రానున్న 49 రోజుల్లో నెల్లూరులో దుమ్ములేకుండా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, నాయకులు తాళ్లపాక అనురాధ, మధు, విజేత, బ్రహ్మం గుప్తా తదితరులు పాల్గొన్నారు.

రక్తపూతలను వెంటనే పరీక్షకు పంపాలి

- సహాయ మలేరియా నివారణ అధికారి నాగార్జునరావు



నీటి నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు (వైద్యం), జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : క్షేత్రస్థాయిలో సేకరించిన రక్త పూతలను వెంటనే పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించి వ్యాధినిర్ధారణ చేయాలని వైద్య శాఖ సిబ్బందిని జిల్లా సహాయ మలేరియా నివారణ అధికారి నాగార్జునరావు ఆదేశించారు. శుక్రవారం చంద్రమౌళినగర్, కొండా యపాళెం గేటు, స్నేహనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమం జరిగింది. దోమల ఉత్పత్తికి అవకాశం కల్పించేలా ఇళ్లలో నీటి నిల్వలు ఉంచుకోరాదని స్థానికులకు తెలయచేశారు. అనుమానిత ప్రాంతా ల్లో ఎక్కువగా రక్తపూతలు సేకరించి వాటిని పరీక్షించాలని, తద్వారా ప్రా ణాంతక వ్యాధులు నివారించవచ్చని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్ర మంలో మలేరియా విభాగం అధికారులు జయరాములు, రామారావు, ఆరోగ్య సహాయకులు శ్రీనివాసులరెడ్డి, సుబ్రహ్మణ్యం, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలపై పోరాటం

- మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు



మహసభలో మాట్లాడుతున్న మదాల వెంకటేశ్వర్లు

నెల్లూరు (వైద్యం), జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఆటో కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామని సీపీఎం నేత డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు వెల్లడించారు. శుక్రవారం జిల్లా ఆటో కార్మిక సంఘం నాల్గవ మహాసభ నగరంలోని మన్సూర్ నగర్‌లో జరిగింది. మాదాలతోపాటు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టీవీవీ ప్రసాద్ మాట్లాడారు. చలానాల పేరుతో ప్రభుత్వం టార్గెట్ ఇచ్చి పోలీసుల ద్వారా వేలాది రూపాయలు వసూలు చేస్తోందని విమర్శించారు. జీవో నెంబరు 21తో రవాణా రంగంలో అన్ని రకాల ఫీజులు పెరిగాయని, దీని వల్ల ఆటో కార్మికులపై భారం పడుతోందని చెప్పారు. ఆటో కార్మికులకు వెంటనే ఆటో మిత్ర పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం 21 మందితో నూతన కమిటీని ఎంపిక చేశారు. గౌరవ అధ్యక్షుడిగా పులిమి నరసింహారెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులుగా పెంచలయ్య, లవకుమార్, ఆఫీస్ బేరర్స్‌గా శ్యామ్‌సన్, షానవాజ్, ముని, జావిద్, హమీద్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఆటోకార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజా, సురేష్, సీఐటీయూ రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు కొండా ప్రసాద్. పెంచల నరసయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

9న దేశవ్యాప్త

సీఐటీయూ రూరల్ కార్యదర్శి పెంచల నర్సయ్య



ప్రదర్శన నిర్వహిస్తున్న వివిధ వర్గాల కార్మికులు

నెల్లూరు (వైద్యం) జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9వ తేదీన సీఐటీయూ ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మె జరుగుతుందని, దీనిని కార్మికులు జయప్రదం చేయాలని సీఐటీయూ రూరల్ కార్యదర్శి పెంచల నర్సయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని వేదాయపాళెం సెంటర్ నుంచి నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి విగ్రహం వరకు కార్మికులతో ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులు యూనియన్ పెట్టుకునే హక్కు, సమస్యలపై పోరాడే హక్కు లేకుండా చేసేలా కేంద్రం యత్నిస్తోందని ఆరోపించారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు కార్మికులు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్, నర్సింహారెడ్డి, సురేష్, లవ కుమార్, ప్రదీప్, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో పనుల పర్యవేక్షణ



దర్గాలో పర్యటిస్తున్న హెల్త్ అధికారి డాక్టర్ చైతన్య

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : రొట్టెల పండుగ సందర్భంగా బారాషహీద్ దర్గాలో జరుగుతున్న ఏర్పాట్లు, దుకాణాల నిర్మాణాన్ని శుక్రవారం నగర పాలక సంస్థ హెల్త్ అధికారి డాక్టర్ చైతన్య పర్యవేక్షించారు. సింగిల్ యూజ్, నిషేధిత ప్లాస్టిక్ ఉపయోగించరాదని దుకాణదారులను ఆదేశించారు. దర్గా ప్రాంతంలో అవసరమైన బ్లీచింగ్ లైన్, పారిశుధ్య పనిముట్లను టెండర్ ప్రక్రియ ద్వారా త్వరగా కొనుగోలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. దర్గా ఆవరణంలో పారిశుధ్య పనుల్లో ఎలాంటి సమస్యలు రాకుండా చూసేందుకు 7 జోన్ల ఇన్‌స్పెక్టర్లతో ఆయన సమీక్షా సమావే శం నిర్వహించారు.

పేకాట స్థావరంపై దాడి

దుత్తలూరు(ఉదయగిరి), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై గురువారం రాత్రి ఉదయగిరి సీఐ ఎన్ వెంకటరావు తన సిబ్బందితో దాడి చేశారు. 13 మంది జూదరులను అదుపులోకి తీసుకుని రూ.50,750 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఎత్తిపోతల పథకం ద్వారా మార్చిలోపు కొమ్మరపూడికి నీరు

- రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వెల్లడి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : వచ్చే ఏడాది మార్చిలోపు నెల్లూరు రూరల్‌లోని కొమ్మరపూడి గ్రామానికి పెన్నా నది నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా తాగు, సాగునీటిని అందిస్తామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రకటించారు. ఆ గ్రామానికి రూ.80 లక్షలతో నిర్మించతలపెట్టిన రోడ్డు పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ రహదారి నిర్మాణాన్ని 45 రోజుల్లో పూర్తిచేస్తామని వెల్లడించారు. మార్చి నాటికి ఎత్తిపోతల పథకం పూర్తయ్యేలా అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి పనులు చేయిస్తామని ప్రకటించారు. ఆగస్టు నెలాఖరికి అన్నీ గ్రామాల్లో త్రీ ఫేస్ కరెంట్ సదుపాయాన్ని కల్పిస్తామని తెలిపారు. కందమూరు-ఉప్పుటూరు రోడ్డును కూడా నిర్మిస్తామని ఆయన తెలిపారు.

- **టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు**

నగరంలోని 30వ డివిజన్‌కు చెందిన వైసీపీ నాయకులు శ్రీనివాసులు రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శివప్రతాప్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, లతీఫ్, మల్యాద్రి తదితరులు ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో వారికి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ విజయకుమార్, ఎమ్మెల్యే కార్యా లయ ఇన్‌చార్జి వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, నాయకులు ఇందుపూరు శ్రీనివాసు లురెడ్డి, ప్రదీప్, సురేష్‌నాయుడు, వేణు, వెంకటేశ్వర్లు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

పూల బండి పంపిణీ



బండిని అందజేస్తున్న టైటస్ నిర్మలకుమార్, తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : అబైండింగ్ హోప్ ట్రస్ట్ ఛైర్మన్ టైటస్ నిర్మలకుమార్ శుక్రవారం పేద మహిళకు పూల వ్యాపారం కోసం రూ.25 వేలతో తయారు చేసిన తోపుడు బండిని అందజేశారు. కొండాయపాలెంలోని ఓ చర్చిలో పబ్లిక్ రిలేషన్ సొసైటీ ఆఫ్ ఇండియా అమరావతి చాప్టర్‌తో కలిసి 350 మందికి పౌష్టిక ఆహార ప్యాకెట్లు అందజేశారు.

నట్టల నివారణతోనే జీవాలు ఆరోగ్యం : డీడీ



నట్టల నివారణ మందును జీవాలకు తాగిస్తున్న వీవీ సోమయ్య

నెల్లూరు(వ్యవసాయం), జూన్ 27(ఆంధ్రజ్యోతి): నట్టల నివారణతోనే మేకలు, గొర్రెలు ఆరోగ్యంగా ఉంటాయని, రైతులకు ఆదాయం పెరుగుతుం దని వెటర్నరీ పాలీక్లినిక్(వీపీసీ) డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ టీ సోమయ్య పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, పశు సంవర్ధకశాఖ నిర్వహిస్తున్న నట్టల నివారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నగరంలోని వెంకటేశ్వరపురం భగత్‌సింగ్‌కాలనీలో వీపీసీ ఆధ్వర్యంలో ఉచితంగా నట్టల నివారణ మందులను జీవాలకు తాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికి నాలుగు సార్లు నట్టల నివారణ మందులు తాగించడం వల్ల జీవాలు అధిక బరువు కలిగి ఎక్కువ మాంసాన్ని ఉత్పత్తి చేయగలుతా యని చెప్పారు. అదేవిధంగా జీవాల్లో వ్యాధి నివారణ శక్తి పెరిగి మరణాల శాతం తగ్గుతుందని తెలిపారు. ఈ సందర్భంగా దాదాపు 466 గొర్రెలు, మేకలకు మందులు తాగించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ జీ కృష్ణమూర్తి, పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఏడీ డాక్టర్ చైతన్య కిషోర్, లైవ్‌స్టాక్ సహాయకులు శ్రీనివాసులు, స్వర్ణలత, కుమార్ బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు భద్రతపై అవగాహన ఉండాలి : ఎస్ఈ



విద్యుత్ భద్రతా వారోత్సవాల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు భద్రత, పొదుపుపై వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నామని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ తెలిపారు. ఇందులో భాగంగా గురువారం నుంచి భద్రతా వారోత్సవాలు ప్రారంభం అయ్యాయని చెప్పారు. నగరానికి సంబంధించి శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎస్ఈ పాల్గొని ప్రసంగించారు. విద్యుత్తు భద్రతపై వినియోగదారులు అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. అలాగే ఉద్యోగులు భద్రతను పాటించాలని సూచించారు. అధునాతన, సాంకేతిక, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టం, ఎలక్ట్రికల్ వాహనాలు, రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్లు, భద్రతా ప్రమాణాలకు నిదర్శనంగా నిలుస్తున్నాయన్నారు. వేసవిలో వాడకం పెరిగినందున గృహాలలో ఏసీలు, కూలర్‌లు అధికంగా వాడుతున్న సమయంలో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి అగ్ని ప్రమాదాలు సంభవించే పరిస్థితి ఉన్నందున వాటిపైన అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి శేషాద్రి బాలచంద్ర, ఈఈ శ్రీధర్, డీఈలు అశోక్, సునీల్, కిరణ్ పాల్గొన్నారు.



నిర్లక్ష్యం నీడలో సచివాలయం

- శుభ్రతకు నోచుకోని వైనం

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల్లో భాగంగా ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని చెప్పే అధికారులు, ఉద్యోగులు వారి కార్యాలయాల్లో మాత్రం నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారనేందుకు ఈ ఫొటో నిదర్శనం. మండలంలోని కాంచెరువు సచివాలయానికి పనులపై వెళ్లిన ప్రజలు అక్కడి పరిస్థితిని చూసి ఉద్యోగుల నిర్లక్ష్య వైఖరిపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రాంగణం చుట్టూ ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, ఉద్యోగు లు ఉండే గదుల్లోనూ అపరిశుభ్రత తాండవిస్తోంది. విలువైన సామగ్రిని భద్ర పరచకుండా ఓ గదిలో పడేయడంతో అవి తుప్పు పట్టి పనికిరాకుండా పోతున్నాయి. గదులతోపాటు వరండాలోనూ కనీసం చీపురు పట్టి ఊడ్చే దిక్కు లేకపోవడంతో ఎటువైపు చూసిన చెత్తా, చెదారం పేరుకుంటోంది. ఈ కారణం గా దోమల బెడద ఎక్కువైంది. ఉద్యోగులు వినియోగించిన ప్లాస్టిక్ కవర్లు, తాగు నీటి సీసాలు, ఇతర వ్యర్థాలను కూడా గదుల్లోనే పడేశారంటే వారి పనితీరు ఏవిధంగా ఉందో తేటతెల్లమవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల్లోని సచివాలయల్లో పరిశుభ్రత పాటించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ

- 30లోగా పేర్లు నమోదు చేసుకోవాలి
- పరిశ్రమల శాఖ జీఎం మారుతీ ప్రసాద్

నెల్లూరు(వెంకటేశ్వరపురం), జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం ఉచిత శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు పరిశ్రమల శాఖ జీఎం మారుతీప్రసాద్ ఓ ప్రకటలో పేర్కొ న్నారు. ర్యాంప్ పథకంలో భాగంగా 30 రోజులు ఈ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 18 నుంచి 58 ఏళ్ల మధ్య వయసు వారు ఆధార్, ఫొటోలు, రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రంతో ఈ నెల 30లోగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. నెల్లూరు పరిధిలోని పొగతోటలో గల సమతా నర్సింగ్ హోమ్, కావలిలోని కేవీఆర్ కన్వెన్షన్ హాల్, కందుకూరులోని సీఆర్‌సీ కమ్యూనిటీ బిల్డింగ్, బుచ్చిలోని అమరావతి కాంప్లెక్స్ సుబ్బయ్య టిఫిన్ సెంటర్ దగ్గర, పొదలకూరులోని రామాలయంవీధి యోగా కేంద్రం లో దరఖాస్తులు అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు 9000173808 , 8121331514 నెంబరులను సంప్రదించాలని కోరారు.

జడ్పీకి సౌర విద్యుత్తు

నెల్లూరు (జడ్పీ), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ కార్యాలయానికి సౌర విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసి, బిల్లుల భారాన్ని తగ్గించనున్నట్లు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తెలిపారు. జడ్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ ప్లాంటును శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని అన్నీ ప్రభుత్వ కార్యాలయాలకు సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకునేందుకు ఆదర్శంగా జడ్పీ కార్యాలయంలో తొలిగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.6.75లక్షలతో 30కిలో వాట్ సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. అలాగే జిల్లాలోని అన్ని మండల పరిషత్ కార్యాలయాల్లోనూ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీంతో 80శాతం విద్యుత్ చార్జీలు తగ్గుతాయని వివరించారు. కేంద్రం రాయితీ ఇస్తున్నందున, దీనిని సద్వినియోగం చేసుకోవాలని, దీనిపై మండల పరిషత్ అధికారులు దృష్టిపెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఈవో మోహన్‌రావు పాల్గొన్నారు.



సోలార్ ప్లాంటును ప్రారంభిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

భక్తుల కొంగు బంగారం

కలిగిరమ్మ

- రేపటి నుంచి తిరుణాళ్ల
- 5 రోజుల సంబరం.. 3 ఊళ్లలో గ్రామోత్సవాలు



గ్రామదేవత కలిగిరమ్మ ఆలయం



కలిగిరమ్మ అమ్మవారు

కలిగిరి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలే తీర్చే భక్తుల కొంగు బంగారం కలిగిరి గ్రామదేవత కలిగిరమ్మ. దుత్తలూరు మండలం నర్రవాడలో వెలసిన వెంగమాంబ తిరుణాళ్ల అనంతరం మెట్ట ప్రాంతంలో జరుపుకునే కలిగిరమ్మ తిరుణాళ్లను జిల్లాలో జరిగే పెద్ద ఉత్సవాలలో ఒకటిగా చెప్పవచ్చు. 3 గ్రామాల్లో 5 రోజులు పాటు జరిగే ఈ ఉత్సవాలు ఈనెల 29వ తేదీ (ఆదివారం) నుంచి ప్రారంభమై గురువారం వరకు జరుగుతాయి. ఈ ఉత్సవాలకు వృత్తి రీత్యా దేశ విదేశాలతోపాటు వ్యాపారం రీత్యా సుదూర ప్రాంతాల్లో ఉన్న వారంతా స్వగ్రామాలకు తరలివస్తారు. వీరితో పాటు బంధుమిత్రలు కూడా అధిక సంఖ్యలో తరలివస్తారు. దీంతో ఈ 5 రోజులు ఈ మూడు గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంటుంది.

ఆలయ చరిత్ర

సుమారు 300 ఏళ్ల క్రితం కలిగిరి గ్రామంలో వింజమూరు, కొండాపురం రహదారి కూడలిలో వెలసిన కలిగిరమ్మ కలిగిరి పట్టణ ప్రజలతోపాటు చుట్టుప్రక్కల గ్రామప్రజలతో నిత్యపూజలందుకుంటోంది. కలిగిరి గ్రామ దేవతగా ప్రాచుర్యంలోకి వచ్చింది. కలిగిరమ్మకు కలిగిరి పంచాయతీలోని పాపనమునిలిపాలెం పుట్టినిల్లు, జిర్రావారిపాలెం మెట్టినిల్లుగా వాడుకలో ఉంది.

తిరునాళ్ల తంతు

పూర్వకాలం నుంచి వస్తున్న ఆచారాల ప్రకారం అమ్మవారి తిరుణాళ్లను ఆచార కాపులు అయిన కలిగిరికి చెందిన 'అక్కరాజు' వంశం, పాపన మునిలిపాలెంకు చెందిన 'పాపన' వంశం, జిర్రవారిపాలెంకు చెందిన 'జిర్రా' వంశం వారి అనుమతులతో ప్రారంభిస్తారు.

ప్రభలు

పొట్టేళ్లు, ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లకు అందంగా ప్రభలను అలంకరించుకొని, వాహనాలను దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేయడం ప్రత్యేక ఆకర్షణ. అనంతరం సుడిమాను ఉత్సవానికి భారీగా భక్తులు తరలివస్తారు. నిలుపురోజున అమ్మవారి ఆలయంలో ఉంచిన పాలవెల్లిని చివరగా జిర్రా వంశస్తులు రాజులుగాను, పాపన వంశస్తులు ప్రధానులుగా వ్యవహరించి పనిపాటల వారికి పంచిపెట్టడంతో తిరుణాళ్ల తంతు ముగుస్తోంది.

ప్రత్యేక ఆకర్షణగా సుడిమాను

ఉత్సవాలకు ముందురోజున అమ్మవారి ఆలయం ముందు 'సుడిమాను' ప్రతిష్ఠించడం ఆలయం వద్ద ఆచారంతోపాటు ప్రత్యేక ఆకర్షణ. రెండవరోజు పుట్టినిల్లు పాపనమునిలిపాలెం, మూడవరోజు మెట్టినిల్లు జిర్రావారిపాలెంలో నాల్గవరోజు కలిగిరిలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణతో గ్రామోత్సవం నిర్వహిస్తారు. తిరుణాళ్ల తంతు చివరి రోజైన ఐదవరోజు దేవాలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోతోంది. అమ్మవారికి పొంగళ్లు, నైవేద్యం సమర్పణతో భక్తులు పెద్ద సంఖ్యలో దేవాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యంగా..

- ప్రభుత్వ బడుల్లో 5న మెగా పేరెంట్, టీచర్ మీటింగ్
- అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం



నెల్లూరు(విద్య), జూన్ 27 (ఆంధ్రజ్యోతి) :విద్యారంగంలో వస్తున్న అనేక సంస్కరణలను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాలల మధ్య సంబంధాలను బలపరచడానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చేసి 2047 నాటికి వికసిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని సంకల్పించింది. దీనిలో భాగంగానే జిల్లాలోని 3,221 ప్రభుత్వ పాఠశాలల్లో జులై 5వతేదీన మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ సమావేశాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం నిధులను కూడా కేటాయించనున్నారు. పదిమంది పిల్లలు ఉన్న బడులకు వెయ్యి రూపాయలు, 300 నుంచి 400 మంది పిల్లలు ఉన్న బడులకు రూ.5వేలు, ఇలా సంఖ్యను బట్టి నిధులను కేటాయించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, సమగ్రశిక్ష అధికారులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించనున్నారు. వారం రోజులు ముందుగానే అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని డీఈఓ ఆదేశాలు ఇవ్వడంతో జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. తల్లిదండ్రుల కమిటీల సమావేశాలు కొత్త కానప్పటికీ ఈసారి మాత్రం పలు ప్రత్యేకతలు జోడించారు. పూర్వ విద్యార్థులు, దాతలు, ఉపాధ్యాయులు ఎవరిస్థాయిలో వారు మరికొంత నిధులు సేకరించి కార్యక్రమాలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం ఆహ్వాన కమిటీ, బడ్జెట్ కమిటీ, బడి సుందరీకరణ, పర్యావరణ పరిరక్షణ, రిసెప్షన్, సీటింగ్ ఏర్పాట్లు, విద్యార్థుల ప్రగతి నివేదికలు, స్టేజీ నిర్వహణ ఇలా పలు రకాల కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడిఈడు పిల్లలందరికీ నాణ్యమైన విద్యను అందించేందుకు, సంపూర్ణ అభివృద్ధిని సాధించడానికి కార్యక్రమాన్ని రూపకల్పన చేశారు.

పిల్లల ప్రగతిపై నివేదికలు

ప్రత్యేకంగా నిర్వహించే ఈ సమావేశంలో పిల్లల ప్రగతికి సంబంధించిన పూర్తిస్థాయి నివేదికలను తల్లిదండ్రులకు అందచేయనున్నారు. సమగ్రశిక్ష అధికారులు సిద్ధం చేస్తున్న ఈ ప్రోగ్రెస్ కార్డుల్లో మార్కులు, హాజరుతో పాటు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర రంగాల్లో కనబరిచిన ప్రతిభ, ఆరోగ్యపరంగా ఎత్తు, బరువు, వ్యాధి నిర్ధారణ పరీక్షల వివరాలు పొందుపరుస్తున్నారు. విద్యార్థులు ఇళ్లవద్ద సెల్‌ఫోన్స్, ట్యాబ్‌లు అధికంగా వినియోగించకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతో పాటు తల్లులకు రంగోలి, తండ్రులకు టగ్ ఆఫ్ వార్, పిల్లలకు వివిధ రకాల ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు అందచేస్తారు. పూర్వ విద్యార్థులు, ప్రజా ప్రతినిధులను కూడా ఆహ్వానించి కార్యక్రమం విజయవంతం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. కార్యక్రమంలో భాగంగా కుటుంబ ఫొటో బూత్‌లు, డ్రీమ్ వాల్స్, పాజిటివ్ పేరెంటింగ్ సెషన్‌లు, ఏక్ పేడ్ మా కే నామ్(అమ్మ పేరుతో మొక్క నాటడం), గ్రీన్ పాస్‌పోర్ట్ కార్యక్రమాలు చేపడుతున్నారు. అలాగే ఆసక్తి కలిగిన విద్యార్థులు మొక్కలు సరఫరా చేయడానికి ముందస్తుగా పేర్లు నమోదుగా ప్రత్యేకంగా యాప్‌ను అందుబాటులో ఉంచారు. మానసిక ఆరోగ్యం, డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సందేశాలు, పిల్లల పురోగతిపై ఇంటరాక్టివ్ సెషన్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

ప్రతిష్ఠాత్మకంగా నిర్వహణ



జిల్లాలో మెగా పేరెంట్, టీచర్ మీటింగ్‌ను జులై 5న జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నాం. కలెక్టర్ ఆనంద్ పర్యవేక్షణలో డీఈఓ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, విద్యాశాఖ సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారు. విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందించడంతోపాటు పాఠశాలల అభివృద్ధి, చేస్తున్న, చేపట్టబోవు కార్యక్రమాలపై తల్లిదండ్రులతో సమావేశం నిర్వహిస్తాం. జిల్లావ్యాప్తంగా తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధుల సూచనలు, సలహాలతో కార్యక్రమం విజయవంతం చేస్తాము.

- వెంకట సుబ్బయ్య, సమగ్రశిక్ష ఏపీసీ

ఇంకెన్నాళ్లీ కష్టాలు?

- ఆశించిన స్థాయిలో సాగని ఫ్లైవోవర్ల నిర్మాణ పనులు
- బుజబుజనెల్లూరు, గొలగమూడి క్రాస్ రోడ్డు వద్ద అవస్థలు
- గడువు ముగిసినా సగం కూడా పూర్తి కాని ఆర్‌వోబీలు



బుజబుజ నెల్లూరు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం, రోడ్డుపై ఆగిన వాహనాలు

నెల్లూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) :రోజు రోజుకు విస్తరిస్తున్న నెల్లూరు నగరంలో జనాభా, వాహనాలు పెరుగుతుండడంతో ట్రాఫిక్ సమస్య కూడా ఎక్కువైంది. ప్రధానంగా బుజబుజనెల్లూరు జంక్షన్, గొలగమూడి క్రాస్ రోడ్డు, చింతారెడ్డిపాలెం క్రాస్ రోడ్ల వద్ద ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయి. ఈ జంక్షన్లలో ఫ్లైవోవర్లు (రోడ్ ఓవర్ బ్రిడ్జి-ఆర్‌వోబీ) నిర్మించేందుకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) ప్రతిపాదనలు తయారు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపింది. వివిధ దశల సమీక్షల అనంతరం 2022లో కేంద్రం అనుమతులు మంజూరు చేసింది. రూ.85 కోట్ల అంచనాలతో బుజబుజనెల్లూరు వద్ద కిలోమీటర్ మేర ఒక ఫ్లైవోవర్, గొలగమూడి క్రాస్ రోడ్డు వద్ద కిలోమీటర్ మేర మరో ఫ్లైవోవర్ నిర్మిస్తున్నారు. వీటితోపాటు సుందరయ్య కాలనీ నుంచి గొలగమూడి క్రాస్ రోడ్డు వరకు సర్వీసు రోడ్డును కూడా ఏర్పాటు చేయాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వ అనుమతులు రాగానే ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు వేగంగా టెండర్ల ప్రక్రియను పూర్తి చేశారు. 2022, అక్టోబరులో టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి ఓ కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు.

అలస్యంగా నిర్మాణాలు

టెండర్ నిబంధనల ప్రకారం రెండేళ్లలో ఈ పనులు పూర్తి చేయాల్సి ఉంది. కానీ తొలుత భూసేకరణ సమస్యతో కొన్ని నెలలపాటు పనులు మొదలు కాలేదు. ఆ తర్వాత రెవెన్యూ అధికారులు భూసేకరణను పూర్తి చేశారు. అనంతరం పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ మరో సబ్ కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. ఈ క్రమంలోనూ కొంత కాలం పనులు అలస్యమయ్యాయి. పనులు ఆలస్యంగా జరగడంపై అప్పట్లో ఎన్‌హెచ్‌ఏఐ ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించి సీరియస్‌గా తీసుకున్నారు. ఈ క్రమంలో గతేడాది పనులు మొదలుపెట్టించారు. దీంతో బుజబుజనెల్లూరు, గొలగమూడి క్రాస్ రోడ్ల వద్ద ట్రాఫిక్ డైవర్షన్‌లు ఏర్పాటు చేశారు. అయితే పనులు మొదలైనప్పటి నుంచీ ఆశించినంత వేగంగా జరగడం లేదు. గతేడాది చివరికే పనులు పూర్తి కావాల్సి ఉన్నా అలా జరగకపోవడంతో కాంట్రాక్టర్‌కు ఈవోటీ (గడువు పొడిగింపు) ఇచ్చారు. దీని ప్రకారం ఈ ఏడాది అక్టోబరు నాటికి బ్రిడ్జీలు పూర్తి కావాల్సి ఉంది. కానీ ప్రస్తుతం పనులు జరుగుతున్న తీరు మాదిరిగా కొనసాగిస్తే వచ్చే ఏడాది అక్టోబరు నాటికి కూడా పనులు పూర్తి చేయడం కష్టమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

డిసెంబరు నాటికి పూర్తి

నెల్లూరు నగర పరిధిలోని రెండు ఫ్లైవోవర్ నిర్మాణ పనులు వేగంగానే జరుగుతున్నాయి. మొదట్లో భూసేకరణ సమస్య, యాష్ సమస్యతో కొంత ఆలస్యమయ్యాయి. ఈ ఏడాది చివర వరకు కాంట్రాక్టర్‌కు ఈవోటీ ఇచ్చారు. డిసెంబరు నాటికి బ్రిడ్జీలు పూర్తి చేసేలా లక్ష్యం పెట్టుకున్నాం.

- కొండయ్య చౌదరి, ఎన్‌హెచ్‌ఏఐ పీడీ

మైన్ల పరిశీలన

సైదాపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమ మైనింగ్‌లు జరుగుతున్నాయని గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారుల బృందం సంయుక్తంగా శుక్రవారం పరిశీలించింది. ఈసందర్భంగా జయలక్ష్మీ, కనకదుర్గ, శ్రీనివాస పద్మావతి, కేఎస్ఆర్ వరసిద్ధి వినాయక మైన్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఆర్డీవో నాగసంతోషి అనూష, తహసీల్దారు సుభద్ర, మైనింగ్, పొల్యూషన్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మైన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సోమశిలలో 33.300 టీఎంసీల నీరు

అనంతసాగరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం 196 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా 33.300 టీఎంసీల నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 425, దక్షిణ కాలువకు 850, పెన్నాడెల్టాకు 3,300 క్యూసెక్కులు వదులుతున్నారు.

జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ

నెల్లూరు(విద్య), జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 50 శాతం ఫీజు రాయితీ కల్పించేలా చర్యలు తీసుకోవాలని డీఈవోకు కలెక్టర్ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని అన్నీ పాఠశాలల కరస్పాండెంట్లకు ఉత్తర్వులివ్వాలని సూచించారు. దీనిపై డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు స్పందిస్తూ జిల్లాలోని అన్ ఎయిడెడ్ పాఠశాలల కరస్పాండెంట్లతో మాట్లాడి 50శాతం ఫీజు రాయితీ ఇచ్చేలా డిప్యూటీ ఈవోలు, ఎంఈవోలు చర్యలు తీసుకోవాలని, దీనిని తక్షణమే అమలు చేయాలని ఆదేశాలిచ్చారు.

మొహర్రం నెల ప్రారంభం

- ముస్లింల పవిత్ర ప్రార్థనలు
- రొట్టెల పండుగకు జెండా ప్రతిష్ఠ

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఇస్లాం క్యాలెండరులో మొదటి నెలైన మొహర్రం శుక్రవారం ప్రారంభమైంది. ముస్లింలు రంజాన్ మాసం తర్వాత పవిత్ర మాసంగా దీనిని పాటిస్తారు. దైవ ప్రవక్త మహ్మద్ మనుమళ్లు హస్సన్- హుసేన్ వీరోచిత ప్రాణ త్యాగానికి గుర్తుగా పీర్లు ఏర్పాటు చేసి పూజిస్తారు. 10వరోజు మొహర్రం నిప్పుల గుండం తొక్కుతారు. పీర్లను వీధుల్లో ఊరేగించి జలదిలో కలుపుతారు. ఈ మాసంలో నెల్లూరులో మత సామరస్యానికి ప్రతీకగా రొట్టెల పండుగ జరుగుతుంది. దేశవిదేశాల నుంచి భక్తులు నెల్లూరు నగరంలోని బారాషహీద్ గంధ మహోత్సవానికి తరలివస్తారు. అలాగే కసుమూరులోని దర్గాను, ఏఎస్‌పేట దర్గాను దర్శించి మొక్కులు చెల్లించుకుంటారు.



బారా షహీద్ దర్గాలో భక్తుల సందడి

దర్గాలో భక్తుల సందడి

మొహర్రం నెల, రొట్టెల పండుగ పనులకుగాను గురువారం రాత్రి బారా షహీద్ దర్గాలో జెండా ప్రతిష్ఠించి, ముస్లిం మత పెద్దలు ప్రార్థనలు చేశారు. దీంతో బారాషహీద్ దర్గా వద్ద రొట్టెల పండుగ ఏర్పాట్లు ఊపందుకున్నాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల రాకపోకలతో దర్గా, స్వర్ణాల చెరువు ఘాట్‌లో సందడి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా ప్రతీ గ్రామం లో పీర్ల చావిళ్ల ఏర్పాటు సన్నాహాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. జూలై 6 నుంచి 10వతేదీ వరకు రొట్టెల పండుగ జరగనుంది.

కసుమూరు దర్గా హుండీల ఆదాయం రూ.44,01,700

వెంకటాచలం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసుమూరు మస్తాన్ వలి దర్గా ప్రధాన హుండీల ద్వారా రూ.44,01,700 ఆదాయం వచ్చినట్లు దర్గా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షేక్ షరీఫ్ తెలిపారు. ఆ నగదుకు గ్రామస్థులు, దర్గా ముజావర్ల సమక్షంలో వక్ఫ్‌బోర్డు అధికారులు శుక్రవారం రాత్రి పంచనామా చేశారు. దర్గాలో ఉన్న 8 హుండీలకు గాను రెండు ప్రధాన హుండీలను మాత్రమే లెక్కించినట్లు చెప్పారు. మిగిలిన 6 హుండీలను 15 రోజుల తర్వాత లెక్కిస్తారన్నారు. హుండీల లెక్కింపు వక్ఫ్‌బోర్డు అధికారులు హుస్సేన్, ఖుదావన్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీసుల సమక్షంలో గ్రామస్థులు, దర్గా ముజావర్ల పర్యవేక్షణలో జరిగిందన్నారు.



పంచనామా చేసేందుకు నగదు సిద్ధం చేస్తున్న వక్ఫ్ బోర్డు అధికారులు

ఇంటి పన్నువసూలు చేయాలి

ఏఎస్ పేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఈనెల 30వ తేదీలోగా నూరు శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని ఎంపీడీవో ప్రసన్నకుమారి తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పన్నుల వసూలు స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో అప్డేట్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9226
వెండి కిలో ధర	రూ. 108100
వెండి ఒక గ్రాము	రూ. 111.10

ఛిద్రమైన రహదారులతో ప్రజల అవస్థలు

● పట్టించుకోని అధికారులు

ఉదయగిరి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరి పట్టణంలోని వీధుల్లోని ఛిద్రమైన సీసీ రహదారులతో ప్రజల అవస్థలు పడుతున్నారు. గుంతలపడ్డ, కంకరతేలిన, కుంగిన రోడ్లతో ప్రజలు, వాహనదారులు అగచాట్లు పడుతున్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన రోడ్లు కావడంతో ఈ దుస్థితి నెలకొంది. దెబ్బతిన్న రోడ్లకు కనీసం మరమ్మతులైనా చేయాలని గత వైసీపీ ప్రభుత్వంలో పాలకులు, అధికారుల చుట్టూ ప్రదక్షణలు చేసినా ఫలితం లేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని ప్రతి పల్లెకు సిమెంట్‌రోడ్లు మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టారు. ఉదయగిరి పట్టణానికి సైతం రెండు రహదారులు మంజూరు చేశారు. అయితే వాటిల్లో ఒకటి జనసంచారం తక్కువగా ఉండే ప్రాంతంలో, మరొకటి బాగానే ఉన్న రహదారి నిర్మించారు. దీంతో పట్టణ వాసులు మండిపడుతున్నారు. మరోవైపు పల్లెపండుగలో వేసిన రోడ్లకు బిల్లులు రాక, కొత్తవి మంజూరైనా వేసేందుకు గుత్తేదారులు వెనుకంజ వేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు, వాహనదారులు కోరు తున్నారు.



ఎస్సీ కాలనీ వద్ద అధ్వానంగా సిమెంట్‌రోడ్డు

న్యూస్ బాక్స్

ఉదయగిరికి చేరిన సైకిల్‌యాత్ర



సాయిరాంను సన్మానిస్తున్న జనసేన పార్టీ సమన్వయకర్త వెంకటేశ్వర్లు

ఉదయగిరి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రెడ్‌క్రాస్‌లో విధులు నిర్వహిస్తున్న సాయిరాం రక్తదానంపై అవగాహన కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న సైకిల్‌యాత్ర శుక్రవారం ఉదయగిరి పట్టణానికి చేరుకుంది. ఈసందర్భంగా ఉదయగిరి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త కొట్టే వెంకటేశ్వర్లు, నాయకులు, కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికి సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా జనసేన పార్టీ తరుపున నియోజకవర్గంలో రక్తదాన శిబిరం ఏర్పాటుచేసి సాయిరాంను ఆహ్వానిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి అల్లూరి రవీంద్ర, నాయకులు నిమ్మలపల్లె రామచైతన్య, కమతం శ్రీను, రసూల్‌పఠాన్, పవన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



నీటితొట్టెలను శుభ్రం చేయిస్తున్న సిబ్బంది

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని హెల్త్ అసిస్టెంట్ యనమల శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం స్థానిక ఎస్సీ కాలనీలో నిర్వహించిన ఇంటింటా లార్వా సర్వేలో మాట్లాడుతూ నివాసాల్లో రోజుల తరబడి నీటి నిల్వ లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. దోమల ద్వారా వ్యాధులు వ్యాప్తి చెందకుండా తప్పనిసరిగా దోమతెరలను వినియోగించాలని సూచించారు. ఎలాంటి వ్యాధి లక్షణాలు కన్పించినా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. అనంతరం నీటి నిల్వ ప్రాంతాలను పరిశీలించి శుభ్రం చేయించి ద్రావణాన్ని పిచికారీ చేయించారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్త ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా చెత్త సేకరణ పరిశీలన



ఇంటింటా చెత్త సేకరణను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్

సంగం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా సంగం పంచాయతీలో పారిశుధ్య కార్మికుల ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని డిప్యూటీ ఎంపీడీవో జీవీఎస్‌వి ప్రసాదు శుక్రవారం పరిశీలించారు. పారిశుధ్య సిబ్బంది ప్రతిరోజు పొడి చెత్త, తడి చెత్త సేకరణకు సక్రమంగా వస్తున్నారో, లేదో స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసయ్య ఉన్నారు.

ఉర్దూ ఉపాధ్యాయుడిని నియమించాలి

అనంతసాగరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడు ఉన్నత పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయుడిని నియమించాలని గ్రామస్థులు ఎంఈవో2 ప్రభాకర్‌రెడ్డికి శుక్రవారం విజ్ఞప్తి చేశారు. ఎక్కువగా ముస్లీం విద్యార్థులు ఉండగా ఉర్దూ ఉపాధ్యాయుడు లేక ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యా కమిటీ సభ్యులు, సీపీఎం నేతలు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

సంగం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిబికేఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌కు పూర్వ విద్యార్థి వేమా మల్లికార్జున రావు, ఆయన కుమారుడు విక్రమ్ శుక్రవారం పాఠశాలకు రూ. 50వేల విలువైన కంప్యూటర్, ప్రింటర్‌ను శుక్రవారం అందచేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

దుత్తలూరు(ఉదయగిరి), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఉన్నతాధికారుల సమాచారం మేరకు గురువారం రాత్రి ఉదయగిరి సీఐ ఎన్ వెంకటరావు తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 13 మంది జూదరులను అదుపులోకి తీసుకోవడంతోపాటు రూ. 50,750 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈదాడుల్లో ఎస్ఐలు ఆదిలక్ష్మి, ఇంద్రసేనారెడ్డి, శివకృష్ణారెడ్డి, రఘునాథ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



గడ్డం ఆంజనేయులు సతీమణికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న టీడీపీ నాయకులు

సీతారామపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మండల పరిధిలోని పోలంగారిపల్లి గ్రామానికి చెందిన గడ్డం ఆంజనేయులు సతీమణికి సీఎం రిలీఫ్ ఫండ్ రూ.50950ల చెక్కు అందచేశారు. ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు యాదవ్ కృష్ణయ్య, తుమ్మల కిరణ్, పోలినేని చంద్రబాబు ఆధ్వర్యంలో శుక్రవారం వింజమూరులోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో సీతారామపురం మండల నాయకులు దేవర వెంకటేశ్వర్లు, ఎడమ ప్రవీణ్, సింగాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముఖ ఆధారిత హాజరుతో పౌష్టికాహారం పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్వైజర్ షేక్ షాను

సీతారామపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇకపై అంగన్వాడి కేంద్రాల్లో ముఖ ఆధారిత హాజరుతోనే అంగన్వాడీ కార్యకర్తలు పౌష్టికాహారం పంపిణీ చేయాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ షేక్ షాను సూచించారు. ఆమె శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో నిర్వహించిన అంగన్వాడీ సెక్టార్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యా బోధన చేస్తూ, చిన్నారులచే ఇతర అభ్యసనా కార్యకలాపాలు చేయించాలన్నారు. కేంద్రాల నిర్వహణలో సమయపాలన పాటిస్తూ ప్రీస్కూల్ కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలన్నారు. యాప్‌లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న డేటా నమోదును ఈనెలాఖరులోగా పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో యాక్టింగ్ సూపర్వైజర్ రత్తమ్మ, అంగన్వాడిలు పాల్గొన్నారు.

టీడీపీ అనుబంధ సంఘాల ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న పరిశీలకులు మధుసూదన్

మర్రిపాడు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం టీడీపీ మర్రిపాడు మండల సమావేశం జరిగింది. ఈసందర్భంగా టీడీపీ అనుబంధ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పరిశీలకుడు మధుసూదన్, టీడీపీ మండల అధ్యక్షుడు గంగాధర్ యాదవ్, సీనియర్ నాయకులు ఆరికట్ల జనార్ధన్‌నాయుడు, శాఖమూరి నారాయణ, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు



టీచర్‌కు సభ్యత్వ నమోదు పత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు.

కలువాయి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ కలువాయి మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కుల్లూరు, దాచూరు, చీపినాపి, కలువాయి, పెన్నబద్వేలి కాంప్లెక్స్ పరిధిలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. 80 మంది ఉపాధ్యాయులకు సభ్యత్వం నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అధ్యక్షుడు నాపా నాగరాజు, ప్రధాన కార్యదర్శి జీవీ మురళీకృష్ణ, దిలీప్‌కుమార్, రవిరాజు, రఫీ, కిషోర్, రాజేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడికి సన్మానం



చెంచలబాబును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వింజమూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గుండెమడకల గ్రామంలోని ప్రాథమిక పాఠశాల (మెయిన్)లో ప్రధానోపాధ్యాయునిగా పనిచేసి ఇటీవల జరిగిన సాధారణ బదిలీల సందర్భంగా నేరేడుపల్లి ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయిన గాలం చెంచలబాబుని ప్రధానోపాధ్యాయుడు పరమేశ్వరరావు, సహోపాధ్యాయులు పెంచలరెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు, గ్రామస్థులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ నూతన కమిటీల ఎన్నిక



నూతన అధ్యక్షులకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న తెలుగుదేశం పార్టీ పట్టణ ఎన్నికల పరిశీలకులు మహమ్మద్ జాఫర్ షరీఫ్

ఆత్మకూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీలోని పలు వార్డుల్లో శుక్రవారం పట్టణ తెలుగుదేశం పార్టీ ఎన్నికల పరిశీలకులుగా విచ్చేసిన రాష్ట్ర టీడీపీ మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి మహమ్మద్ జాఫర్ షరీఫ్, పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నూతన కమిటీ ఎన్నిక ప్రక్రియ కొనసాగింది. 4వార్డు నూతన అధ్యక్షుడిగా వెంకటసుబ్బయ్య, 14వార్డు అధ్యక్షుడిగా తోడేటి పెంచలయ్య, 17వార్డు అధ్యక్షుడిగా మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్‌సర్ధార్, 18వ వార్డు అధ్యక్షుడిగా షేక్‌అస్లాం, 19వార్డు అధ్యక్షుడిగా షేక్ ఇనాయతుల్లా, 7వార్డుకు సయ్యద్ మల్లిక, 16 వార్డుకు షేక్ బషీర్ నూతన అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఇందూరు వెంకటరమణారెడ్డి, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి తోడేటి వెంకటయ్య, జి బుజ్జిరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు నూరా భాస్కర్‌రెడ్డి, షేక్ మహబూబ్‌బాషా, పొడమేకల పెంచలయ్య, జి వేణు, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆషాడ మాసం సారె కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఈవో, సమరసత ఫౌండేషన్ సభ్యులు

దుత్తలూరు (ఉదయగిరి), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ గ్రామంలో ఉన్న వెంగమాంబ పేరంటాలమ్మకు సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వచ్చేనెల 17 వ తేదీన నిర్వహించే అషాడ మాసం సారె కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని ఫౌండేషన్ జిల్లా మహిళా సేవా కన్వీనర్ మాలెపాటి స్రవంతి కోరారు. అందులో భాగంగా శుక్రవారం ఆలయ ఆవరణలో ఆలయ కార్యనిర్వాహణాధికారి వెట్టిగుంట ఉషశ్రీ, సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలు పాడిపంటలు, సుఖసంతోషాలతో ఉండాలని ఈ సారె కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి గ్రామం నుంచి కుటుంబ సమేతంగా వచ్చి అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు సారెగా సమర్పించాలన్నారు. నియోజక వర్గం లోని ఎనిమిది మండలాలకు చెందిన మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్య క్రమాన్ని జయప్రదం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేక పాటి మాల్యాద్రినాయుడు, చుండి హరిగోపాల్ రెడ్డి, భాస్కర్, చంద్రశేఖర్, ఫౌండేషన్ సభ్యులు రమాదేవి, రాణెమ్మ, పద్మావతి, అంకమ్మ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడమే 'జై ఆంధ్ర' ధ్యేయం



జై ఆంధ్ర సమాచార హక్కు చట్టం రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడిగా ప్రమాణం చేస్తున్న మన్నే వెంకటరత్నం

ఉదయగిరి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పేదలకు సేవ చేయడమే జైఆంధ్ర సమాచార హక్కు చట్టం ధ్యేయమని వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బీహెచ్ సుమిత్రానందన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయ ఆవరణలో ఉదయగిరి మండలం కోటాయపల్లికి చెందిన మన్నే వెంకటరత్నం జైఆంధ్ర సమాచారహక్కు చట్టం రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడిగా ఎన్నికైన సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో జిల్లాల వ్యాప్తంగా తమ సంస్థ ఆధ్వర్యంలో కన్వీనర్లను ఏర్పాటు చేశామన్నారు. వారి ద్వారా పేదలకు అవసరమైన సమాచారాన్ని సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించి న్యాయం చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో అనేకమంది పేదలకు తమ సంస్థ ఆధ్వర్యంలో సేవలందించడం జరిగిందన్నారు. భవిష్యత్తులో రెండు రాష్ట్రాల్లో సంస్థ కార్యాకలాపాలను విస్తృతం చేస్తామన్నారు. అనంతరం వ్యవస్థాపక అధ్యక్షుడితో పాటు నూతనంగా ఎంపికైన మన్నే వెంకటరత్నంను పలువురు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గొడుగులూరి మాల కొండ్రాయుడు, కామేపల్లి వెంకటరత్నం, పెంద్యాల సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు : ఎస్ఐ



వాహన పత్రాలను పరిశీలిస్తున్న ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి

ఉదయగిరి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పత్రాలు సరిగాలేని పలు వాహనాలకు అపరాధ రుసుం విధించారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, ఆటోవాలాలు పరిమితికి మించి ప్రయాణికులను చేరవేసినా చర్యలు తప్పవన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. బస్టాండ్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వాహనాలను పార్కింగ్ చేయాలన్నారు.

నేడు పలు గ్రామాలలో విద్యుత్ కోత

ఏఎస్ పేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఏఎస్ పేట సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ నిమిత్తం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలలో శనివారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పాడుతుందని విద్యుత్ ఏఈ నిరంజన్ తెలిపారు. ఈసందర్భంగా ఏఎస్‌పేట, అనుమసముద్రం, తెల్లపాడు, పెద్దహబీపురం, చిన్నహబీపురం, చెందులూరుపాడు, చిరమన, జమ్మవరం, కాకార్లపాడు, పందిపాడు గ్రామాలలో విద్యుత్ సరఫరా ఉండదని, ఈ విషయం ప్రజలు గ్రహించి సహకరించాలని కోరారు.

C.R.I.M.E N.E.W.S

బంగారం చోరీపై ప్రశ్నిస్తే రాళ్లతో దాడి

● అన్నదమ్ముళ్లకు తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న రాజకుమార్

బిట్రగుంట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బంగారం చోరీపై అనుమానంతో ఓ వ్యక్తిని ప్రశ్నించగా రాళ్లతో దాడి చేసిన ఘటన శుక్రవారం సాయంత్రం బోగోలు పంచాయతీ బేతనీపేటలో జరిగింది. వివరాల మేరకు.. బోగోలు పంచాయతీ బేతనీపేటలో నివసిస్తున్న రాజకుమార్ ఇంట్లో ఏసీ మరమ్మతులకు గురైంది. దానికి మరమ్మతులు చేసేందుకు అదే ప్రాంతానికి చెందిన ఏసీ మెకానిక్ షేక్.అఫ్రీద్ గురువారం సాయంత్రం వచ్చి మరమ్మతులు చేశాడు. కుటుంబ సభ్యులు బెడ్‌రూంలో ఏసీని ఆన్‌చేసి కూలింగ్ అవుతుందో లేదో చూస్తుండగా ఏసీ మెకానిక్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం ఇంటి హాలోని సోఫాలో ఉంచిన హ్యాండ్ బ్యాగ్‌ను చూసుకోగా అందులో ఉంచిన బంగారు గాజులు కనిపించలేదు. దీంతో మెకానిక్‌పై అనుమానంతో శుక్రవారం ఉదయం అతని ఇంటికి వెళ్లగా అతను లేకపోవడంతో సాయంత్రం రాజకుమార్, రజనీకుమారులు మరోసారి అతని ఇంటికి వెళ్లారు. హ్యాండ్ బ్యాగులో ఉంచిన బంగారు గాజులు గురించి ప్రశ్నిస్తుండగా వారిని తోసేసి వీధిలోకి పరుగుతీశాడు. అక్కడ దొరికిన రాళ్లతో అన్నదమ్ముళ్లపై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో అన్నదమ్ములిద్దరికి తీవ్రగాయాలవడంతో రక్షణ కోసం తిప్ప పోలీస్ స్టేషక్ వెళ్లారు. అక్కడి నుంచి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108లో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ దాడి విషయమై విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ ప్రభాకర్ తెలిపారు.

అక్రమంగా తుమ్మచెట్ల నరికివేత



చెరువులో కూలీలతో తుమ్మచెట్లు నరికిస్తున్న అక్రమార్కులు

కలిగిరి, జూన్ 27(ఆంధ్ర జ్యోతి): మండలంలోని చిన అన్నలూరు చెరువులో అక్రమంగా తుమ్మ చెట్లు నరికివేతపై సర్పంచు రాగి కుమారి భర్త ప్రసాద్, గ్రామస్థులు ఇరిగేషన్ ఏఈ శ్రీనాథ్ రెడ్డికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. వివరాల మేరకు.. చెరువులో తు మ్మచెట్లు అక్రమంగా కొట్టి వేస్తున్నారన్న సమాచారం మేరకు సర్పం చు వర్గీయులు చెరువులోకి వెళ్లి వారిని ప్రశ్నించగా అధికార పార్టీకి చెందిన నాయకుడికి తాము కొంత సొమ్ము ముట్టజెప్పి కొట్టుకుంటు న్నామన్నారని వారుతెలిపారు. ఈ విషయాన్ని ఏఈకి తెలియజేయగా ఏఈ అక్రమంగా తుమ్మచెట్లు నరికివేతపై కేసు నమోదు చేయిస్తామ ని హెచ్చరించగా కూలీలు వెళ్లిపోయారు. ఏఈ మాట్లాడుతూ మండలంలోని చెరువుల్లోని కలప రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రేమ విఫలంతో యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలమై మనస్థాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని శెట్టిగుంటరోడ్డు ఉడ్‌హౌస్ సంఘం ప్రాంతంలో నివసించే సాదా వెంకటేశ్వర్లు, వెంకట రమణమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు అశోక్(26) ఉన్నారు. అశోక్ ఓ యువతిని ప్రేమించి అది విఫలం కావడంతో ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. విషయం తెలుసుకున్న తండ్రి వెంకటేశ్వర్లు హుటాహుటిన కుమారుడిని రామచంద్రారెడ్డి వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. దీంతో ఆయన నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరి మృతి



మృతి చెందిన మాధవరెడ్డి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి రామాపురం గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఆండ్రావారిపల్లి గ్రామానికి చెందిన దాడి మాధవరెడ్డి మోటారుబైకుపై ప్రకాశం జిల్లా పామూరు నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. అదేక్రమంలో కడప జిల్లా ముద్దనూరు నుంచి కూరగాయల లోడుతో రాజమండ్రి వెళ్తున్న ఓ మినీ వ్యానుకు చెందిన ముందు వైపు టైరు బరస్ట్ కావడంతో మోటారుబైకును ఢీకొంది. దీంతో మాధవరెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ రఘునాథ్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరికి తరలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కత్తులతో బెదిరించి నగదు దోచుకున్న వ్యక్తుల అరెస్ట్



నిందితుల వివరాలు తెలుపుతున్న ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

నెల్లూరు(క్రైం), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిసై, జల్సాలకు అలవాటు పడి ఒంటరిగా ఉండే వ్యక్తులను కత్తులతో భయపెట్టి వారి వద్ద నుంచి నగదు దోచుకెళ్లే దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. నెల్లూరులోని నవాబుపేట పోలీసు స్టేషన్‌లో నిందితుల వివరాలను ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం మీడియాకు వెల్లడించారు. నగరంలోని నవాబుపేట ఎఫ్‌సీఐ కాలనీకి చెందిన బ్యాంకు ఉద్యోగి తన కుటుంబ సభ్యులతో కలిసి మోటారు సైకిల్‌పై ఈ నెల 25వ తేదీ రాత్రి 11.45 నిమిషాల సమయంలో ప్రయాణిస్తుండగా ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వెంబడించారు. ప్రధాన రైల్వే స్టేషన్ ఎదురుగా అడ్డగించి, కత్తులు చూపించి భయపెట్టి డబ్బు లాక్కున్నారు. అదే రోజు రాత్రి తడికల బజారు అరుంధతీవాడలో ఒంటరిగా ఇంటి బయట నిద్రిస్తున్న మహిళను అదే ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కత్తితో బెదిరించి డబ్బు లాక్కున్నారు. ఈ రెండు ఫిర్యాదులపై నవాబుపేట సీఐ వేణుగోపాల్‌రెడ్డి కేసులు నమోదు చేసి ప్రత్యేక బృందాలతో దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో శుక్రవారం ఉడ్‌హౌస్ సంఘం ప్రాంతానికి చెందిన యానం మునితేజ, చింతకాయల మహేష్‌కుమార్, బాలాజీనగర్‌కు చెందిన బొర్రా దేవకుమార్‌తోపాటు మరో ఇద్దరు బాల నేరస్థులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఐ రహిమాన్, సిబ్బంది బీవీ నరసయ్య, ఎస్ ప్రసాద్, టీ మస్తాన్‌రావు, డీ.సుధాకర్, ఎం.వేణు, జీ.మస్తానయ్య, ఎస్‌కే గౌస్‌బాషాను ఎస్పీ అభినందించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	115
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	232

కోడిగుడ్ల ధర (100): 575

పగలే వెన్నెల

లింగసముద్రం, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మారెడ్డిపాలెంలో పట్టపగలే వెన్నెలను తలపించేలా వీధిలైట్లు వెలుగుతొన్నాయి. చాలా కాలం నుంచి ఈ విధంగా వీధిలైట్లు వెలుగుతున్నా పంచాయతీ పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ వీధిలైట్లను రాత్రి వేళ ఆన్ చేసేందుకు, ఉదయం ఆఫ్ చేసేందుకు ఏర్పాటు చేసిన ఫ్యూజు బాక్స్‌ను ఆపరేట్ చేసే సిబ్బంది లేక పోవడంతో లైట్లు రాత్రి పగలు తేడా లేకుండా వెలుగుతోన్నాయి. దీంతో విద్యుత్ ఖర్చు పెరుగుతోంది. పంచాయతీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.





చుండి మోడల్‌స్కూల్లో భోజనం చేస్తున్న విద్యార్థినులు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు

రుచికరమైన భోజనం

● ఆపై పౌష్టికాహారం పంపిణీ ● స్కూళ్లలో సమూల మార్పులకు ప్రభుత్వం శ్రీకారం

వలేటివారిపాలెం, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం పేరుతో సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల అభిప్రాయాలను సేకరించిన ప్రభుత్వం మెనూలో మార్పులు తెచ్చింది. ప్రస్తుతం ఈ ఏడాది ప్రారంభం నుంచే విద్యార్థులకు సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం అందించాలని ప్రభుత్వం నిర్ణయించి పాఠశాలలకు సన్నబియ్యం సరఫరా చేసింది. వలే టివారిపాలెం మండలంలో 41 ఎంపీపీ స్కూళ్లు, 4 ఎంపీయూ పీ స్కూళ్లు, 4 హైస్కూళ్లు, ఒక మోడల్‌స్కూల్, ఒక కేజీబీవీ స్కూల్ ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 2,511 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది. ఆ విద్యార్థులకు సన్నబియ్యంతో భోజ నం అందిస్తున్నారు. 80 శాతం మందికిపైగా విద్యార్థులు ఆయా పాఠశాలలో మధ్యాహ్న భోజనం తింటున్నారని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

రోజూ పాఠశాల వద్దే తింటున్నా..



రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం అందజేసి ఎంతో మేలు చేసింది. సన్న బియ్యంతో తయారు చేసిన భోజనం ఎంతో రుచికరంగా ఉంది. దీంతో రోజూ పాఠశాల వద్దే మధ్యాహ్న భోజనం తింటున్నా.

\- అంకమ్మ, ఇంటర్ విద్యార్థిని

ఎక్కువమంది తింటున్నారు..



రాష్ట్ర కూటమి ప్రభుత్వం వచ్చాక పాఠశాలలో మధ్యాహ్న భోజనం సన్నబియ్యంతో వండుతున్నారు ఈ భోజనాన్ని ఎక్కువ మంది పిల్లలు తింటు న్నారు. సన్న బియ్యంతో వండడం వల్ల చాలా రుచిగా ఉంది. తినడానికి విద్యార్థులు ఇష్టపడుతున్నారు.

\- సంధ, 10వ తరగతి

ప్రారంభం రోజు నుంచే మార్పు



బడి ప్రారంభం రోజు నుంచే మధ్యాహ్న భోజనంలో మార్పు తెచ్చారు. గతంలో బియ్యం లావుగా ఉండడంతో అన్నం తినేవాళ్లం కాదు. ఇప్పుడు సన్న బియ్యం సరఫరా చేశారు. ఈ బియ్యంతో తయారుచేసిన భోజనం చాలా రుచిగా ఉంది.

\- దీపిక, 9వ తరగతి

మంత్రి నారా లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



మంత్రి నారా లోకేష్‌తో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యా, ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్‌ను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం సాయంత్రం రాజధాని అమరావతిలో కలిశారు. ఈ సందర్భంగా కందుకూరు నియోజకవర్గంలో గత ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులకు లోకేష్ అందించిన తోడ్పాటు పట్ల కృతజ్ఞతలు తెలిపి ప్రస్తుతం నియోజకవర్గంలో చేపట్టాల్సిన పనులపై చర్చించినట్లు ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. కందుకూరు నియోజకవర్గ అభివృద్ధి తనవంతు సహకారం ఎల్లప్పుడు అందిస్తానని ఈ సందర్భంగా లోకేష్ హామీ ఇచ్చాడని ఆయన పేర్కొన్నారు.

దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం కల్పించాలి

● కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ



వినికిడి యంత్రాలు అందచేస్తున్న సబ్ కలెక్టర్ శ్రీపూజ

కందుకూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం కల్పించాలని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ కోరారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం సెంటర్‌లో హెలెన్ కెల్లర్ జయంతి సందర్భంగా శుక్రవారం సక్షమ్ సేవా సంస్థ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సబ్ కలెక్టర్ చేతుల మీదుగా దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, వినికిడి మిషన్లు, చేతి కర్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగుల సహితం సమాజంలో తాము ఎంచుకున్న రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు ద్వారా తోడ్పాటు అందిస్తున్నాయని తెలిపారు. ముందుగా అమర జీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన సబ్ కలెక్టర్ అంకిత భావంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సక్షమ్ ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సక్షమ్ రాష్ట్ర సభ్యుడు చెన్నా రామాంజనేయులు, పట్టణ ఎస్ఐ వీ శివనాగరాజు, చెక్కా కేశవ, మరారిశెట్టి సుధీరు, కోటా కిశోరు, పబ్బిశెట్టి వరదరాజ, కంకణాల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు ఇవ్వాలి

లింగసముద్రం, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీ కార్యకర్తలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి జీ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని పెదపవని ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలోని చినపవని గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో సెక్టార్ మీటింగ్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంగన్వాడీలపై సాధికార సర్వేలో నమోదైన ప్రభుత్వ ఉద్యోగి, రూ.12,000 జీతం అనే అంశాలను తొగించాలన్నారు. వారికి కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, అన్ని రకాల యాప్‌ల ను రద్దు చేసి, ఒకే యాప్ కింద తీసుకొని రావాలని డిమాండ్ చేశారు. అలాగే అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోరుతూ, జూలై 9వ తేదీన దేశవ్యాప్త సమ్మె జరుగుతుందని, ఈ సమ్మెలో అంగన్వాడీ వర్కర్లు పాల్గొనాలన్నారు. ఈ సందర్భంగా 9 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అంగన్వాడీ మండల కమిటీ అధ్యక్షురాలిగా ఎస్ రమణ, కార్యదర్శిగా పీ శైలజ, కమిటీ సభ్యులుగా కే సుభాషిణి, ఎం మమత, ఏ విద్యావతి, ఎస్ సుజాత, డీ విజయకుమారి, టీ రేవతిలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు కొట్టే వెంకయ్య, ఏ జ్యోతి, జీ శ్యామల, సర్దరీ, శంషాద్ పాల్గొన్నారు.

సింహాద్రిరావుకు ఘన సన్మానం



డాక్టర్ సింహాద్రిరావును సన్మానిస్తున్న దళిత సంఘాల నేతలు

బిట్రగుంట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పేద, అనాథ, రోగ పీడుతులకు ఎనలేని సేవలందించిన దళితుడు డాక్టర్ కే.సింహాద్రిరావు ప్రపంచ బుక్ ఆఫ్ రికార్డ్ అవార్డు పొందడం హర్షించ తగ్గ విషయమని పలు దళిత సంఘాల నేతలు ప్రశంసించారు. ఈ మేరకు శుక్రవారం బోగోలు మండలం ఎస్సీపాలెం పంచాయతీలోని సింహాద్రి రావు స్వగృహంలో అంబేడ్కర్ యువజన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం జరిగింది. సాల్మన్ రాజు మాట్లాడుతూ సింహాద్రిరావు చేస్తున్న సామా జిక కార్యక్రమాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీ.సతీష్, ఎం.నరేంద్ర, పీ.సుధాకర్, డీ.మాల్యాద్రి, వీ.వెంకట రమణయ్య, వేణుగోపాల్, కే.యస్వంత్, అంబేడ్కర్ ఇండియా మిషన్, మాల పరిరక్షణ వేదిక, అంబేడ్కర్ ఆర్మీ తదితరులు పాల్గొన్నారు.

కాలువలో సేదతీరిన పందులు

● మురుగు ముందుకు సాగేదెలా?



మురుగు కాలువలో సేదతీరుతున్న పందులు

కావలి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలో పందుల సమస్య ఎక్కువగా ఉన్నా వాటిని నివారించడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. పట్టణంలోని సబ్‌కోర్టు వీధిలో డ్రైనేజీ కాలువలో పందులు వరసగా సేద తీరాయి. దీంతో మురుగు ముందుకు కదలకుండా రోడెక్కింది. కొన్ని చోట్ల మురుగు నీరు ముందుకు కదలక ఇళ్లలోనే నిలిచి పోతోంది. ప్రస్తుతం రోడ్లపై చెత్త కనిపించకుండా అధికారులు చర్యలు చేపడుతున్నా పందులు నివారించడంలో వెనుకడుగు వేయటంలో ఆంతర్యమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పందుల నివారణకు చర్యలు చేపట్టి మురుగునీటి పారుదలకు ఆటంకాలను తొలగించాల్సి ఉంది.

పైపులైన్‌కు మరమ్మతులు

కావలి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలోని 18వ వార్డులోని బైరాగుల కాలనీలో మంచినీటి పైపులైన్ మరమ్మతులకు గురైంది. స్థానిక టీడీపీ వార్డు ఇన్‌చార్జి శానం హరి సమాచారం మేరకు మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్, డీఈ సాయిరామ్, ఏఈ వినోద్ శుక్రవారం మరమ్మతులకు గురైన పైపులైన్‌ను పరిశీలించారు. వెంటనే దానికి మరమ్మతుల పనులు చేపట్టి శనివారం ఆ ప్రాంతానికి తాగు నీరు సరఫరా చేస్తామని తెలిపారు.

కనకదుర్గ అమ్మణ్ణికి సారె సమర్పణ



ప్రత్యేక అలంకరణలో కనకదుర్గాదేవి

కావలిటౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వడ్డిపాలెంలో ఉన్న కనకదుర్గా ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ముత్తయిదువ లచే సారె సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు పీ మోహన స్వామి మాట్లాడుతూ ఆషాఢ మాసం తొలి శుక్రవారం పురస్కరించు కుని అమ్మవారిని ప్రత్యేక అలంకరణ గావించి ముత్తయిదువులచే సారె సమర్పించారన్నారు. ప్రజలకు అమ్మవారి ఆశీర్వాదం కలగాలని ప్రత్యేక పూజలు నిర్వహించామని సామూహిక లలితా సహస్ర నామ పారాయణం చేశారన్నారు. రెండవ శుక్రవారం అమ్మవారికి శాఖాంబరి అలంకారణ గావించి ఉత్సవం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పల్లపు మోహన్, గుంజి అహ్మద్, తన్నీరు ప్రభాకర్, పల్లపు కుమార్, పల్లపు వెంకటేశ్వర్లు, శ్రావణ్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలి : డీసీ

వలేటివారిపాలెం, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పని చేయాలని డిప్యూటీ కమిషనర్ సాయిబోయిన చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో పనిచేసే సిబ్బంది, ఆలయ అధికారులకు శుక్రవారం ఆయన పలు సలహాలు సూచనలు ఇచ్చారు. మరుగుదొడ్లు, కేశఖండనశాల, భక్తులు దర్శనానికి వెళ్లే క్యూలైన్లు, లడ్డూ ప్రసాదం కౌంటర్, తదితర పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ పరిసర ప్రాంతాలను ఎప్పటిప్పుడు పరిశుభ్రం చేయాలని తెలిపారు. భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఆలయ సిబ్బంది భక్తులతో స్వామి అని గౌరవంగా మాట్లాడాలని పేర్కొన్నారు. భక్తుల పట్ల అగౌరవంగా మాట్లాడినట్లు నా దృష్టికి వస్తే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సహకారంలో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు.



మాలకొండలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్

తడి చెత్తతో సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ



పాత కంపోస్టుయార్డులో తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ ఇస్తున్న మున్సిపల్ కమిషనర్, తదితరులు

కావలి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కావలి పురపాలక సంఘంలో ఇంటింటి నుంచి సేకరించిన తడి చెత్తను వేరు చేసి దానిని విండ్రోస్ విధానం ద్వారా సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నట్లు కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ట్రంకురోడ్డు ఉత్తర శివారులో ఉన్న పాత కంపోస్టుయార్డులో సేంద్రియ ఎరువులు తయారీపై కార్మికులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. తడి చెత్తను ఒక్కో విభాగాన్ని లేయర్లుగా వేస్తూ పేపర్‌వేస్ట్ పరుస్తూ దానిపై పేడ నీరు చల్లుతూ సేంద్రీయ ఎరువును తయారు చేస్తున్నారు. కమిషనర్ మాట్లాడుతూ దీనివలన చెత్తను అంతా మన్నెంగిదిన్నె వద్ద ఉన్న కంపోస్టుయార్డుకు తరలించకుండా అందుబాటులో ఉన్న పాత కంపోస్టుయార్డుకు తడి చెత్తను తరలించి వచ్చన్నారు. ఆ చెత్తతో ఎరువు తయారు చేస్తే రవాణా భారం తగ్గటమే కాక తయారైన సేంద్రీయ ఎరువును పురపాలకసంఘం పెంచుతున్న మొక్కలకు నినియోగించుకుంటూ అవసరమైతే ఇతరులకు విక్రయించి ఆదాయం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సాయిరాం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బషీర్, ఏఈలు, శానిటరీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ బకాయిలను వెంటనే చెల్లించాలి

● వ్యవసాయ కార్మిక సంఘం నేతలు



ఆందోళన కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

కావలిటౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనుల బకాయిలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తాళ్లూరు మాల్యాద్రి కోరారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ బకాయిల చెల్లింపు, 200 రోజుల పని దినాలు, రోజుకు రూ.600 కూలీ ప్రధాన డిమాండ్లుగా ఈనెల 30వ తేదీన కలెక్టరేట్ వద్ద జరుగు ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ మేరకు కరపత్రాలను ఆవిష్కరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీని నిర్వీర్యం చేసిందని, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అదేబాటలో పయనిస్తూ కూలీల సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దశల వారీగా ఉద్యమిస్తున్నామన్నారు. డిమాండ్లు సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు సీతారామయ్య, కార్యదర్శి ఎం రాధాకృష్ణయ్య, కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యుడు జాన్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి : సీపీఎం

కావలిటౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ మీటర్ల బిగింపును ప్రజలు వ్యతిరేకించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య కోరారు. శుక్రవారం పట్టణ 18వ వార్డులో ఇంటింటికీ తిరిగి స్మార్ట్ మీటర్లతో నష్టాలపై వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. పెంచలయ్య మాట్లాడుతూ కరెంట్ చార్జీలు పెంచబోమని కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన ఎన్నికల హామీని విస్మరించి సంవత్సరం కాలంలో 4సార్లు చార్జీలు పెంచిందని, ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో ప్రజలను దోచుకుంటున్నారని విమర్శించారు. మరింత అధిక వసూళ్లకై స్మార్ట్ మీటర్ల విధానం తీసుకొచ్చిందని, స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన టీడీపీ ఇప్పుడెలా తీసుకొస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పేదలను పట్టించుకోకుండా అదానీలాంటి బడాబాబుల ప్రయోజనాలు చేకూర్చేవిధంగా పనిచేస్తుందని విమర్శించారు. అధికారం కోసం ఒక మాటా.. అధికారంలోకి వచ్చాక మరొకమాట చెప్పడం పరిపాటిగా మారిందన్నారు. ప్రజా వ్యతిరేక విధానా లను ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్‌రావు, వై కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

దొంగలను పట్టుకోండి

అల్లూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : గత కొంతకాలంగా విచ్చలవిడిగా దోచుకుంటున్న దొంగలను వెంటనే పట్టుకొని ప్రజల్లో ధైర్యం నింపాలని జనసేన నాయకులు ఎస్ఐ శ్రీనివాసులురెడ్డిని కోరారు. అల్లూరు ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఏ.శ్రీనివాసులు రెడ్డిని జనసేన నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వరుసగా జరుగుతున్న దొంగతనాలను ఆయన దృష్టికి తీసుకెళ్లి దొంగలను వెంటనే పట్టుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కార్తీక్ శర్మ, కత్తుల విజయ్, పేట రాఘవయ్య, చేవూరు సుబ్రహ్మణ్యం, వెంకట రమణ, బుర్రి మల్లికార్జున, కత్తి అనీల్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో చెత్త సేకరణ సక్రమంగా జరగాలి



చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఆదినారాయణరావు

కొండాపురం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్త సేకరణ సక్రమంగా జరగాలని ఎంపీడీవో ఆదినారాయణరావు సిబ్బందికి సూచించారు. మండలంలోని శెట్టిపాలెం పంచాయతీలో జరుగుతున్న చెత్త సేకరణను శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రతిరోజూ గ్రామాల్లో చెత్త సేకరణ జరగాలన్నారు. ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ద్వారా ఆయా గ్రామాల ప్రజలకు ఫోన్లు వస్తాయని చెత్త సేకరణ జరిగేది లేనిది ఫోనులో ఖచ్చితంగా తెలియచేసే విధానాన్ని ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఆయనవెంట పంచాయతీ కార్యదర్శి రవీంద్ర తదితరులున్నారు.

చట్టాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

● ఆటో డ్రైవర్లకు ఎస్ఐ కౌన్సెలింగ్

బిట్రగుంట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): చట్టాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఎస్.ప్రభాకర్ హెచ్చరించారు. బోగోలు మండ ల పరిధిలోని ఆటో డ్రైవర్లతో కప్పరాళ్లతిప్ప పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతలు పాటిస్తూ, వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. అతివేగం పనికి రాదని, పరిమితికి మించి ప్యాసింజర్లను ఎక్కించవద్దని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

చేసిన సేవలే ఉద్యోగికి గుర్తింపు

కలిగిరి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): చేసిన సేవలే ఉద్యోగికి సమాజంలో గుర్తింపునిస్తాయని మండల విద్యాశాఖాధికారి సురేష్ పేర్కొన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్ లో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీషు)గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేయనున్న కొర్నిపాటి సుగుణమ్మను శుక్రవారం పాఠశాల ఆవరణ లో సహోపాధ్యాయులు, సిబ్బంది, పూర్వవిద్యార్థు లు ఘన సన్మానం చేశారు. విద్యార్థులకు విద్యతోపాటు మంచి నడవడిక నేర్పడంతోపాటు పలు పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించిన ఉపాధ్యాయిని సుగుణమ్మ ఉపా ధ్యాయులకు ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీశ్రీ, పలువురు ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.



సుగుణమ్మ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం



సైన్స్ సెంటర్‌లో వృక్షాలకు క్యూఆర్‌కోడ్ ట్యాగులు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ట్యాగ్ ఏ ట్రీ

సైన్సు సెంటర్‌లో 50 వృక్షాలకు క్యూఆర్ కోడ్

ఇది మంచి ప్రయత్నం



ట్యాగ్ ఏ ట్రీ ద్వారా వృక్షాలకు సంబంధించిన విషయాలతో పాటు ఔషధ ప్రాముఖ్యతను గురించి తెలుసుకోవడానికి వీలవు తుంది. దీనిని చూశాక మన ముందున్న చెట్లు ఎంత విలువైనవో అర్థమవుతుంది. మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

\- నిర్మల, తిరుపతి

మంగళం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మన చుట్టూ ఎన్నో వృక్షాలు, మొక్కలు, వనమూలికలు ఉన్నాయి. వాటి గురించి చెప్పగలిగే వాళ్లు అరుదే. దీనిని అధిగమించేందుకు చెట్ల పేరు, అది ఏ ప్రాంతంలో ఎక్కువగా పెరుగుతుంది, దాని లక్షణాలు తదితర వివరాలు అందరికీ తెలియజేయడానికి తిరుపతిలోని సైన్స్‌సెంటర్ ట్యాగ్ ఏ ట్రీ అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తొలుత 50 వృక్షాలకు క్యూఆర్‌కోడ్ ట్యాగింగ్ ఏర్పాటు చేయగా.. దశలవారీగా మిగతా వాటికీ అమర్చనున్నారు. ఈ సైన్స్ సెంటర్‌లో ప్రస్తుతం 1500కుపైగా చెట్లున్నాయి. వీటిలో అరుదైన వృక్షాలు, మొక్కలు, విదేశాలకు చెందిన చెట్లూ ఉన్నాయి. రాయల్‌పామ్, ఫిష్టైల్‌పామ్ వంటి తాటి రకాలు, బొంబాక్స్ సెయిబా, గుల్మోహర్, ఎల్లో ఫ్లేమ్ ట్రీ వంటి పుష్పించే చెట్లతో పాటు జీడిపప్పు, మామిడి వంటివీ ఉన్నాయి. ఆయా వృక్షాల ద్విపద పేరు, సాధారణ పేరు, వర్గీకరణ, స్థానిక పేర్లు, స్థానికత, లక్షణాలు, బయో జియోగ్రఫీ, యత్నో బోటానికల్ వాటికి సంబంధించిన ఫొటోలు కనిపిస్తాయి. దీని ద్వారా ఆ వృక్షాలకు సంబంధించి పూర్తి సమాచారాన్ని తెలుసుకోవచ్చు.

సందర్శకుల నుంచి సానుకూల స్పందన



'ట్యాగ్ ఏ ట్రీ' కార్యక్రమానికి సందర్శకుల నుంచి సానుకూల స్పందన లభిస్తోంది. ప్రతి ఒక్కరూ తమ సెల్‌ఫోన్ల ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఆ చెట్ల వివరాలు తెలుసుకుంటున్నారు. ప్రస్తుతానికి ఆంగ్ల భాషలో ఈ సమాచారం అందుబాటులో ఉంది. త్వరలో తెలుగు, హిందీ భాషల్లోనూ అందుబాటులోకి తీసుకొస్తాం.

\- పురుషోత్తం, సైన్స్‌సెంటర్ ఎడ్యుకేషన్ ఆఫీసర్

సాంకేతికతను జోడించడం అభినందనీయం

చెట్లను కాపాడుకోవాల్సిన బాధ్యతను తెలియజేస్తూ దీనికి సాంకేతికతను జోడించడం అభినందనీయం. వృక్షాల గురించి తెలుసుకోవడం, వాటిని కాపాడుకోవడానికి ట్యాగ్ ఏ టీ ఉపయోగపడుతుంది.

\- విజయ, చిత్తూరు



వార్డు కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ ప్రారంభం



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్, తిరుపతి అడిషనల్ కమిషనర్ చరణ్‌తేజరెడ్డి తదితరులు

చిత్తూరు అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో వార్డు కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమైంది. స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ పర్యవేక్షించారు. బదిలీల కోసం ఆప్షన్‌ను నమోదు చేసుకున్న చిత్తూరు, తిరుపతి నగరపాలక సంస్థలు, మదనపల్లె, పుంగనూరు, పలమనేరు, కుప్పం, శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి పురపాలక సంఘాల పరిధిలో ఐదేళ్లు పూర్తి చేసుకున్న వార్డు కార్యదర్శులకు కౌన్సెలింగ్‌ను నిర్వహించారు. వార్డు అడ్మిన్ కార్యదర్శులు 153 మంది, వార్డు అమినిటీ కార్యదర్శులు 178 మంది, వార్డు ప్లానింగ్ కార్యదర్శులు 143 మంది కలిపి మొత్తం 474మంది హాజరయ్యారు. తిరుపతి నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ చరణ్‌తేజ రెడ్డి, చిత్తూరు సహాయ కమిషనర్ ప్రసాద్, పురపాలక సంఘాల కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధి, ఉద్యోగ కల్పనలో

ఎంఎస్‌ఎంఈలు కీలకం



పలువురు పారిశ్రామికవేత్తలతో ఎంవోయూలు చేసుకుంటున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, అధికారులు

నూతన సాంకేతికత, అవకాశాలను అందిపుచ్చుకోవాలి

యువపారిశ్రామిక వేత్తలకు మంత్రి కొండపల్లి పిలుపు



ఎంఎస్ఎంఈ దినోత్సవానికి హాజరైన వారు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, ఉద్యోగ కల్పనలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పాత్ర కీలకమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వ్యాపారాల్లో 90 శాతం.. ఉద్యోగాల్లో 70 శాతం వాటా వీటిదేనన్నారు. తిరుపతి సమీపం తాజ్ హోటల్‌లో శుక్రవారం జరిగిన ప్రపంచ ఎంఎస్ఎంఈ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. నూతన సాంకేతికతను, అవకాశాలను అందిపుచ్చుకుని ఎంఎస్ఎంఈలు మరింతగా ఎదగాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై శాఖలతో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయడం సీఎం చంద్రబాబుకే దక్కిందన్నారు. 'ఒక కుటుంబం- ఒక పారిశ్రామిక వేత్త' దృష్టికోణంతో చంద్రబాబు ఎంఎస్ఎంఈలకు బ్యాంకు లింకేజీతోపాటు పలు సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇస్రో వంటి సంస్థల సమీపంలో అంతరిక్ష సంబంధిత ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని వివరించారు. ప్రభుత్వమే కాకుండా ప్రైవేటు సంస్థలనూ భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. ప్రతి ఇంటి నుంచి పారిశ్రామిక వేత్తలను తయారు చేయాలన్నది సీఎం చంద్రబాబు గొప్ప నిర్ణయమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ ఎస్వీ సోమనాద్ పేర్కొన్నారు. రానున్న నాలుగేళ్లలో ఎంఎస్ఎంఈలను మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ శివశంకర్‌రావు అన్నారు. జిల్లాలో 1.80లక్షల మంది ఎంఎస్ఎంఈ రంగాలపై ఆధారపడి ఉన్నారని కలెక్టర్ వెంకటేశ్వర్ వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 186 యూనిట్ల లక్ష్యానికి 647 యూనిట్లను సాధించారన్నారు. తిరుపతి, సత్యవేడు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఆదిమూలం తదితరులు ప్రసంగించారు.

9 ఎంవోయూలు

ఎంఎస్ఎంఈ దినోత్సవంలో వివిధ సంస్థలతో 9 ఎంవోయూలను కుదుర్చుకున్నట్లు ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ విశ్వ తెలిపారు. నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్(వైజాగ్), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంఎస్ఎంఈ (హైదరాబాద్), ఎన్ఐడీ, ఎన్‌పీసీ, సీఎస్‌టీ ఎంఎస్ఈ, ఎస్ఐడీబీఐ, ఎప్‌టీఈవో, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ వారితో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు చేసుకున్నట్లు వివరించారు. విశేష ప్రతిభ కనబరచిన ఎంఎస్ఎంఈలను, ఎన్ఏసీఈ వైస్ ప్రెసిడెంట్ కృష్ణ అయ్యర్‌ను మంత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, రాష్ట్ర గ్రీనరీ, బ్యూటిఫికేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ, ఎంఎస్ఎంఈ ఈడీ సుదర్శన్‌బాబు, జిల్లా పరిశ్రమల జీఎం చంద్రశేఖర్, ఏపీఐఐసీ జడ్ఎం విజయభరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20 కిలోల గంజాయి స్వాధీనం

- ఐదుగురి అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయితో డీఎస్పీ చెంచుబాబు, సీఐ మురళీకృష్ణ

సూళ్లూరుపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో శుక్రవారం 20 కిలోల గంజాయి పట్టుకుని.. అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ చెంచుబాబు తెలిపిన ప్రకారం.. సత్యవేడు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన తొండా మునిశేఖర్, సూళ్లూరుపేట మండలం ఆబాకకు చెందిన ఏలిమేటి సతీష్, సూళ్లూరుకు చెందిన పాలా వినయ్, తడ మండలం గ్రద్దగుంటకు చెందిన మధురా జేష్, సత్యవేడు మండలం అయ్యప్పపాలెం గ్రామానికి చెందిన సోదవరం జ్యోతీష్ కుమార్ ముఠాగా ఏర్పడ్డారు. ఒడిశా నుంచి గంజాయి తెచ్చి సూళ్లూరుపేట, తడ, చెన్నై తదితర ప్రాంతాల్లో విక్రయించేవారు. శుక్రవారం మన్నారుపోలూరు వద్ద పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో గంజాయిని తరలించేందుకు సిద్ధం చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, దీని విలువ సుమారు రూ.3.50 లక్షలు ఉంటుందని డీఎస్పీ చెప్పారు. గంజాయిని పట్టుకున్న సీఐ మురళీకృష్ణ, సూళ్లూరుపేట, తడ ఎస్ఐలు బ్రహ్మనాయుడు, కొండపనాయుడు, సిబ్బందిని అభినందించారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 281 మంది హాజరు

- నేటితో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి ● 30 నుంచి ఆప్షన్ల నమోదు

తిరుపతి(విద్య), జూన్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మూడు కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్‌కు 281 మంది అభ్యర్థులు హాజరైనట్లు కౌన్సెలింగ్ జిల్లా కోఆర్డినేటర్, తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకానాథరెడ్డి తెలిపారు. 1,04,001 నుంచి 1,20,000 ర్యాంకుల వారికి కౌన్సెలింగ్ జరిగింది. ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 193 మంది, సత్యవేడులో 15 మంది, గూడూరులో 73 మంది సర్టిఫికెట్లను ధ్రువీకరించుకున్నారు. శనివారం 1,20,001 నుంచి చివరి ర్యాంకు వరకు జరిగే కౌన్సెలింగ్‌తో సర్టిఫికెట్ల పరిశీలన ముగియనుంది. 30వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో ఆప్షన్ల నమోదు ప్రారంభమవుతుంది.



తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో వెబ్ కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

మామిడి రైతులను ఆదుకుంటాం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తోతాపురి మామిడి రైతు నష్టపోకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం తెలిపారు. జిల్లాలో 8 గుజ్జు పరిశ్రమల వద్ద తోతాపురి కాయలు కొంటున్నారన్నారు. ఇప్పటి వరకు పరిశ్రమలకు 30వేల టన్నులు, ర్యాంపులు, మండీల ద్వారా 25 టన్నుల మామిడి సేకరణ జరిగిందన్నారు.

శాంతి, సుభిక్షం కోసం స్కేటింగ్ యాత్ర

నాయుడుపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): దేశంలో శాంతియుత వాతావరణం నెలకొని సుభిక్షంగా ఉండాలని బిహార్‌కు చెందిన రోహన్ స్కేటింగ్ ద్వారా పుణ్యక్షేత్రాలను సందర్శిస్తున్నారు. చెన్నై నుంచి శుక్రవారం నెల్లూరు వెళ్తున్న రోహన్ నాయుడుపేటలో ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. 'బీజాపూర్‌కు చెందిన నేను వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నా. దేశంలో శాంతియుత వాతావరణం నెలకొనాలని ప్రార్థిస్తూ ఫిబ్రవరి 11న స్కేటింగ్ ద్వారా శాంతియాత్ర మొదలు పెట్టా.7 నెలల పాటు ఈ యాత్ర సాగనుంది'అని పేర్కొన్నారు.





ద్విచక్ర వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎస్పీ

ట్రాఫిక్ పోలీసులకు 27 బుల్లెట్లు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 27(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ సమస్యలకు చెక్‌పెట్టేలా అత్యాధునిక టెక్నాలజీతో కూడిన 27 ద్విచక్ర వాహనాలను జిల్లాకు కేటాయించారు. తిరుపతి పోలీసు పరేడ్ మైదానంలో వీటికి శుక్రవారం ఎస్పీ హర్షవర్ధనరాజు పూజలు చేసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ 27 వాహనాల్లో తిరుపతి సబ్ డివిజన్‌కు ఆరు, తిరుమలకు నాలుగు, తిరుపతి సిటీ డివిజన్‌కు మూడు, పుత్తూరుకు రెండు, శ్రీకాళహస్తికి రెండు, రేణిగుంటకు రెండు, నాయుడుపేటకు నాలుగు, గూడూరుకు రెండు, ఎంటీ హెడ్ క్వార్టర్స్‌కు మరో రెండింటిని కేటాయించామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, నాగభూషణరావు, చంద్రశేఖర్, డీఎస్పీలు శ్యాంసుందర్, భక్తవత్సలం, రామకృష్ణమాచ్చారి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

వాహనాల ప్రత్యేకత: ఎక్కడైనా ప్రమాదాలు జరిగిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకునేలా టైర్ల మన్నిక. హెవీ రేంజ్‌లో శబ్దం వచ్చేలా సైరన్లు. హై ఫోకస్ డిజిటల్ లైటింగ్ సిస్టమ్, వైర్‌లెస్ సెట్ ఉండేలా తయారు చేయించారు.

రెవెన్యూ సమస్యలను

వెంటనే పరిష్కరించండి



స్వామిని దర్శించుకుని వస్తున్న జయలక్ష్మి

తిరుపతి అర్బన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఆటో మ్యూటేషన్‌లో తలెత్తే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సీసీఎల్ఏ చీఫ్ కమిషనర్ జయలక్ష్మి అధికారులను ఆదేశించారు. తిరుపతి పర్యటనకు వచ్చిన ఆమె శుక్రవారం ఉదయం అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. భూమి రిజిస్ట్రేషన్ సమయంలో ఆటోమ్యూటేషన్ ద్వారా ఏర్పడే సమస్యలను సులభరీతిలో పరిష్కరించే శాస్త్రీయ విధానంపై రిజిస్ట్రేషన్, తహసీల్దార్ కార్యాలయాల అధికారులకు, టెక్నికల్ సిబ్బందికి అవగాహన కల్పించారు. అప్పటికే ఎంపిక చేసిన పుత్తూరు మండలానికి చెందిన నలుగురు బాధితులను కేస్ స్టడీస్ చేశారు. వారి సమస్యలను బాధితుల సమక్షంలోనే పరిష్కరించారు. అంతకుముందు ఆమె కార్యాలయ ప్రాంగణంలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, పుత్తూరు తహసీల్దార్లు సురేష్‌బాబు, వెంకటేశ్వర్లు, కిరణ్‌కుమార్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏడాదిలో 4 కోట్ల మంది సందర్శకులు: జేసీ



తిరుపతి(కలెక్టరేట్), జూన్ 27(ఆంధ్రజ్యోతి): పర్యాటకంలో భాగంగా ఏడాది కాలంలో నాలుగు కోట్ల మంది జిల్లాను సందర్శించారని జేసీ శుభం బన్సల్ తెలిపారు. అందులో 2.6 కోట్ల మంది తిరుమల శ్రీవారిని దర్శించుకున్నట్లు చెప్పారు. విజయవాడలో సీఎం చంద్రబాబునాయుడు పాల్గొన్న టూరిజం కాంక్లేవ్‌లో జేసీ మాట్లాడారు. పర్యాటకరంగ అభివృద్ధిలో తిరుపతి జిల్లా ముందంజలో ఉందని, పర్యాటకుల భద్రతకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో ప్రాచీన దేవాలయాలతో పాటు తీర ప్రాంతమూ ఉందన్నారు. సీఎం ఆదేశాల మేరకు పర్యాటక రంగానికి మరిన్ని వసతుల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు.

డీపీటీవోగా జగదీష్ బాధ్యతల స్వీకరణ



తిరుపతి(ఆర్టీసీ), జూన్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజారవాణాధికారిగా జగదీష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతిలోని డీపీటీవో కార్యాలయం చేరుకుని సంతకం చేశారు. అనంతరం రోజువారి కార్యకలాపాలలో పాల్గొన్నారు. డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, డిప్యూటీ సీఎంఈ బాలాజీ, ఇతర అధికారులు ఆయన్ను అభినందించి, సన్మానించారు.

లారీని అపహరించింది పూణేవాసులు



పోలీసులు స్వాధీనం చేసుకొన్న లారీ

చంద్రగిరి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం గాదంకి టోల్ ప్లాజా వద్ద గురువారం రాత్రి లారీని అపహరించింది పూణేవాసులని పోలీసు విచారణలో తేలింది. అదే రోజు రాత్రి ఈ లారీని రైల్వే కోడూరు వద్ద పట్టుకుని.. ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. పూణేకు చెందిన ఓ వ్యక్తి బెంగళూరుకు చెందిన ఫైనాన్స్ ద్వారా లారీని కొన్నారు. నెలవారీ కంతులు సక్రమంగా కట్టకపోవడంతో ఫైనాన్స్ కంపెనీ వారు ఆ లారీని స్వాధీనం చేసుకుని వేలం వేశారు. ఎవరూ పాడుకోక పోవడంతో లారీ విడి భాగాలను ముల్‌బాగిల్‌లో విక్రయించారు. కుప్పానికి చెందిన చరణ్‌కుమార్ లారీ ప్రమాదానికి గురై క్యాబిన్ పాడైపోవడంతో.. ముల్‌బాగిల్లోని ఓ మెకానిక్ వద్ద క్యాబిన్ వేయించుకొన్నాడు. ఆ క్యాబిన్ ఫైనాన్స్ కంపెనీ వారు విక్రయించిన క్యాబిన్. ఆ క్యాబిన్‌కు పూణేకు చెందిన లారీ ఓనర్ జీపీఎస్ ఏర్పాటుచేసి ఉంచాడు. ఈ క్రమంలో తన లారీనే నెంబరు మార్చి చరణ్‌కుమార్ నడుపుతున్నట్లు భావించి ఐదుగురితో కలిసి అపహరించాడు. వీరందరినీ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఒంటరి ఏనుగు స్వైరవిహారం



గజదాడిలో ధ్వంసమైన అరటి, కొబ్బరి చెట్లు



నవియాల సమీపంలో ఏనుగు సంచారం

రామకుప్పం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం ననియాల గ్రామ సమీప తోటలపై ఒంటరి ఏనుగు స్వైరవిహారం కొనసాగుతోంది.శుక్రవారం తెల్లవారు జామున 2గంటల ప్రాంతంలో అరటి, టమోటా, మామిడితోటలపై విరుచుకుపడింది. నారాయణప్ప తోటలో గెలలు వచ్చిన సుమారు 15 అరటి చెట్లను, మూడు కొబ్బరి చెట్లను ధ్వంసం చేసింది.ఆయనకే చెందిన టమోటా తోటను కూడా ఏనుగు కొంత మేర తొక్కేసింది. శంకరప్పకు చెందిన తోటలో మామిడి రాశిని తిన్నంతగా తిని, తొక్కి నాశనం చేసింది. నాగరాజు, బెంగళూరప్పలకు చెందిన తోటల్లో కూడా మామిడి కాయలను తిన్నంతగా తిని, నేల రాల్చింది. పలు చెట్ల కొమ్మలను విరిచేసింది. అటవీశాఖ అధికారులు, ట్రాకర్లు అతి కష్టంపై ఏనుగును అటవీ లోతట్టు ప్రాంతం వైపు మళ్ళిస్తున్నా చీకటి పడితే తిరిగి అటవీ సమీప తోటల వైపు వస్తోంది. తోటలపై దాడులకు పాల్పడుతున్న అది ఏ క్షణంలో గ్రామంలోకి వస్తుందోనన్న ఆందోళన గ్రామస్థుల్లో నెలకొంది.ఏనుగు గ్రామం వైపు రాకుండా చర్యలు తీసుకుంటామని అటవీశాఖ అధికారులు భరోసా ఇస్తున్నప్పటికీ వారిని గజభయం వీడడం లేదు.

పంటలపై 17గజరాజుల దాడులు



అడవిలో వెళుతున్న ఏనుగుల గుంపు

కల్లూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటివరకు రెండు గ్రూపులుగా వేర్వేరు ప్రాంతాల్లో పంటలపై దాడులు చేస్తున్న 17 ఏనుగులు గత రాత్రి ఒకేగ్రూపుగా ఏర్పడి పంటలపై దాడులు మొదలెట్టడంతో అటవీ సరిహద్దు ప్రాంతాల్లోని ప్రజలు మరింత ఆందోళన చెందుతున్నారు. గురువారం రాత్రి తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని బోడబండ, ఎగువచలం నుండి బయలుదేరిన 17 ఏనుగుల గుంపు ముందుగా అడవికి సరిహద్దులో ఉన్న మామిడితోటల్లోకి ప్రవేశించాయి. కోటపల్లిలోని దామోదర నాయుడికి చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరిచేసిన ఏనుగులు ఆ భూమికి పక్కనే ఉన్న హంసవేణికి చెందిన మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి కోటపల్లి సమీపానికి చేరుకుని హరినాథ నాయుడికి చెందిన మామిడిచెట్టును పెకలించింది. ఎకరా పశుగ్రాసాన్ని ఏనుగులు తినేశాయి. అక్కడి నుంచి చిత్తూరు-కల్లూరు ఘాట్‌రోడ్ వద్ద ఉన్న ఎస్సార్ పెట్రోల్ బంకు మీదుగా అడవిలోకి చేరుకున్నాయి. శుక్రవారం ఉదయం ఏనుగులు ధ్వంసం చేసిన పంటల పరిశీలనకు వెళ్లిన అటవీ శాఖ సిబ్బందికి అడవిలో వెళుతున్న ఏనుగుల గుంపు కనిపించింది.ఏనుగుల గుంపు చింతలవంక వద్ద పగలంతా తిష్ట వేసినట్లు ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫి, ఎఫ్‌బీవో మధు తెలిపారు.



గజదాడిలో ధ్వంసమైన పశుగ్రాసం, పక్కకు ఒరిగిన మామిడిచెట్టు



తిమ్మరాజుపల్లెలో అధికారులు, రాజకీయ నాయకులతో సమావేశమైన కలెక్టర్, ఎస్పీ, పీడీ తదితరులు

2, 3 తేదీల్లో సీఎం కుప్పం పర్యటన

- తిమ్మరాజు పల్లె పంచాయతీలో ఓటర్లతో మమేకం
- తుమ్మిశి మోడల్ స్కూల్ సమీపంలో సభ



కుప్పం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం నియోజకవర్గ పర్యటన జులై 2, 3 తేదీల్లో దాదాపు ఖరారైంది.తన పర్యటనను ప్రధానంగా రాజకీయ కార్యక్రమాలకే అది కూడా శాంతిపురం మండలానికే ముఖ్యమంత్రి పరిమితం చేసుకున్నారు. ప్రాథమికంగా అందిన సమాచారం మేరకు చంద్రబాబు 2వ తేదీ మధ్యాహ్నం తుమ్మిశి పంచాయతీ పరిధిలోని డుంకుమానిపల్లె వద్ద పునరుద్ధరించనున్న పాత హెలిప్యాడ్‌లో ల్యాండ్ అవుతారు. ఇక్కడినుంచి నేరుగా కడపల్లె సమీపంలో నిర్మించుకున్న గృహానికి వెళ్లిపోతారు. అదే రోజు రాత్రి టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ, నాలుగు మండలాల అధ్యక్షులు, ఇతర ముఖ్య నాయకులతో సమావేశమై పార్టీ పరిస్థితిని సమీక్షిస్తారు. రాత్రి స్వగృహంలోనే బస చేస్తారు. 3వ తేదీ ఉదయం స్వగృహం ఉన్న పంచాయతీ అయిన తిమ్మరాజుపల్లెకు వెళ్లి ఓటర్లతో మమేకమవుతారు. నియోజకవర్గవ్యాప్తంగా పార్టీ పరంగా 60మంది ఓటర్లను కలిపి ఒక కుటుంబ సాధికార సమితి (కేఎస్ఎస్)గా ఏర్పరిచారు. ఈ కేఎస్ఎస్‌కు ఒక ఇన్‌చార్జిని నియమించారు.డుంకుమానుపల్లె పంచాయతీలోని అటువంటి ఒక కేఎస్ఎస్‌కు చంద్రబాబు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు. వారి కుటుంబాలను కలవడంతోపాటు పంచాయతీలోని మరి కొన్ని కుటుంబాలను కలిసి, వారి కష్టనష్టాలను ఆరా తీస్తారు. అనంతరం తుమ్మిశి మోడల్ స్కూల్ ముందు భాగాన గల మైదాన ప్రాంతంలో ఏర్పాటు చేసే సభలో సీఎం పాల్గొంటారు.అదే రోజు సాయంత్రం సమీపంలోని హెలిప్యాడ్‌కు చేరుకుని అక్కడినుంచి హెలికాప్టర్ ద్వారా బెంగళూరు, తర్వాత అమరావతి చేరుకుంటారు.మధ్యలో కొన్ని అధికారిక కార్యక్రమాల్లో సైతం చంద్రబాబు పాల్గొనే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. టాటా కన్సల్టెన్సీ భాగస్వామ్యంతో కుప్పం ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డిజిటల్ నెర్వ్ సెంటర్ (డీఎన్‌సీ)ని ప్రారంభించడంతో పాటు, అధికారులతో సమీక్ష జరుపుతారని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఇందుకు తగిన విధంగా సిద్ధమవుతున్నాయి.

కలెక్టర్, ఎస్పీల పరిశీలన

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఆయన పాల్గొనే కార్యక్రమాలు నిర్వహించనున్న ప్రదేశాలను శుక్రవారం కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ, కడా పీడీ వికాస్ మర్మత్ పరిశీలించారు. తుమ్మిశి పంచాయతీ డుంకుమానిపల్లెవద్ద హెలిప్యాడ్ ప్రాంతానికి వెళ్లి అక్కడ చేయాల్సిన ఏర్పాట్ల గురించి అధికారులకు సూచనలు చేశారు.అనంతరం తిమ్మరాజుపల్లె చేరుకుని, స్థానికులతోను, టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. బహిరంగ సభ ఏర్పాట్ల గురించి చర్చించారు. మరోవైపు శుక్రవారం ఉదయం కడా పీడీ వికాస్ మర్మత్ కుప్పం మండల సచివాలయంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులతో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో వారివారి శాఖల పరిధిలో జరుగున్న అభివృద్ధి పనులపై సమగ్ర డీపీఆర్ తయారు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.శాంతిపురం మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథ నాయుడు, ప్రధాన కార్యదర్శి నాగరాజు, మాజీ వైస్ ఎంపీపీ ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ద్రావిడ వర్సిటీకి ఇంజనీరింగ్ కళాశాల మంజూరు



ద్రావిడ వర్సిటీ ప్రధాన ప్రవేశ ద్వారం

కుప్పం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కుప్పం విద్యార్థులు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న ఇంజనీరింగ్ కళాశాలను ద్రావిడ విశ్వవిద్యాలయానికి మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2025-2026 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంజనీరింగ్ కళాశాల మంజూరైనట్లు విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కిరణ్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కళాశాలలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ), సీఎస్ఈ విత్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ (ఏఐ అండ్ ఎంఎల్) అనే రెండు కోర్సులు మాత్రమే ఆఫర్ చేస్తున్నారు. ఒక్కో కోర్సులో 60 సీట్లుంటాయి. కళాశాల మంజూరు కావడంపై ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్,ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం హర్షం వ్యక్తం చేశారు.ప్రజల తరపున ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

తదుపరి లక్ష్యంగా యూజీ, పీజీ, బీఈడీ కళాశాలల అనుబంధం

గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ద్రావిడ విశ్వవిద్యాలయానికి రెండు ముఖ్యమైన కోర్సులతో ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేయడంపట్ల వర్సిటీ ఇన్‌చార్జి ఉప కులపతి ఎం.దొరస్వామి, రిజిస్ట్రార్ వి.కిరణ్ కుమార్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. తదుపరి లక్ష్యంగా చిత్తూరు జిల్లాలోని యూజీ, పీజీ, బీఈడీ కళాశాలలను వర్సిటీకి అనుబంధంగా తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం ద్రావిడ విశ్వవిద్యాలయానికి అన్నిరకాలుగా మద్దతు ఇస్తున్నదన్నారు.అవుట్ సోర్సింగ్ సిబ్బందికి పెండింగు జీతాలుగా మొదటి దశలో రూ.2.86 కోట్లు, రెండవ దశలో రూ.5.2 కోట్లు విడుదల చేయడంతోపాటు మూడేళ్ల వేతన భరోసా కొనసాగించేందుకు అంగీకరించిందన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు, ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్‌కు,ఏపీఎస్‌సీహెచ్‌ఈ చైర్మన్ ప్రొఫెసర్ మధుమూర్తికి కృతజ్ఞతలు తెలిపారు.

పార్థీ గ్యాంగ్ పనేనా?

- పథకం ప్రకారమే రైల్లో దోపిడి
- విచారణ ముమ్మరం చేసిన పోలీసులు



ఘటనా స్థలం వద్ద గురువారం తనిఖీ చేస్తున్న రైల్వే పోలీసులు

చిత్తూరు రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు సమీపంలోని సిద్ధంపల్లె రైల్వేస్టేషన్‌కు కూతవేటు దూరంలో సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి మరీ గురువారం రైలులో దోపిడీ చేసిన విషయం తెలిసిందే. ఈ దోపిడి ఒక పథకం ప్రకారమే జరిగినట్లు రైల్వే పోలీసులు తేల్చారు. దీనివెనుక మహారాష్ట్రకు చెందిన పార్థీగ్యాంగ్ ఉన్నట్లు అనుమానిస్తున్నారు. నిందితుల కోసం రైల్వే, రాష్ట్ర పోలీసులు కలిసి ప్రత్యేక టీమ్‌గా ఏర్పడి జల్లెడ పడుతున్నారు. మహారాష్ట్ర నుంచి వాహనంలో వచ్చారా? అన్న కోణంలో టోల్‌గేట్లలో తనిఖీ మొదలు పెట్టారు. ఇప్పటికే ఘటన స్థలంలో.. ఫింగర్‌ప్రింట్ సేకరించారు. డాగ్ స్క్వాడ్‌తో క్షుణ్ణంగా పరిశీలించారు.

నెల రోజుల్లో మూడుచోట్ల..

నెల రోజుల వ్యవధిలోనే ఇదే తరహా దోపిడీలు మూడు చోట్ల జరిగాయని సమాచారం. రెండు.. తిరుపతి సెక్షన్ పరిధిలోని ముంగిలిపట్టులో జరిగితే మూడోది.. చిత్తూరు సెక్షన్ పరిధిలోని సిద్ధంపల్లె రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. ఈ మూడు దోపిడీలు ఒకేలా ఉండడంలో అధికారులు ఒకే ముఠా పనేనని నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. ఇటీవల గుంతకల్లు, గుత్తి, రేణిగుంట, కర్నూలు, కడప ప్రాంతాల్లో ఇటువంటి దోపిడీలు జరిగినట్లు తెలుస్తోంది. చిత్తూరులో ఇలాంటి దోపిడీ ఇదే మొదటిదని అధికారులు చెబుతున్నారు. ఈ నెలలో జరిగిన మూడు దోపిడీల్లో సుమారు 250 గ్రాములకుపైగానే బంగారునగలు దోచుకున్నట్లు తెలిసింది. వరుస దోపిడీలతో రైలు ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.



కత్తిరించిన సిగ్నల్ వైరు



చిత్తూరు రైల్వేస్టేషన్‌లో రైల్వే సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అధికారి

బంగారం ధర పెరగడం కూడా ఒక కారణం

ఇటీవల బంగారం ధర పెరిగిపోవడం వల్ల కూడా దుండగులు ఇలాంటి దోపిడీలు చేస్తున్నారని అధికారులు పేర్కొంటున్నారు. ఇందుకోసం మారుమూల రైలు రూట్లను ఎంచుకుంటున్నారు. సిగ్నల్ వైరు కట్ చేసి.. రైలు ఆగేలా చేయడం.. ఆవెంటనే దోపిడీ చేసి పరారవుతున్నారు. ఈ దోపిడీని రైలులోని ఆర్పీఎఫ్ పోలీసులు తెలుసుకునేలోపే దుండగులు మాయమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో సిగ్నల్ వ్యవస్థను మరింత పటిష్ఠంగా అమలు చేయాల్సి ఉందని ప్రయాణికులు కోరుతున్నారు.

రైల్వే పోలీసులు నిర్లక్ష్యం కూడా కారణమా?

రైల్వే పోలీసులు నిర్లక్ష్యం కూడా దోపిడీకి కారణమని ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైలులో గస్తీ నిర్వహించే పోలీసులు ఎవరైనా అనుమానితులు కనిపిస్తే విచారించాలి. అదుపులోకీ తీసుకోవాలి. వీరు నిర్లక్ష్యంగా ఉండటంతోనే దోపిడీలు జరుగుతున్నాయన్న విమర్శలున్నాయి. ఇదే విషయమై వీరికి గురువారం మధ్యాహ్నం ఓ ఉన్నతాధికారి క్లాసు తీసుకున్నారు. మీ నిర్లక్ష్యం వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇదిలా ఉంటే గస్తీ సిబ్బంది సుమారు 50 శాతం వరకు కొరత ఉందని తెలుస్తోంది. రెండు మూడు రైలు పెట్టెలకు ఒక్కో పోలీసు ఉండాల్సి ఉండగా.. రైలు మొత్తానికి ఇద్దరే ఉంటున్నారని సమాచారం.



తిరుపతిలో జగన్నాథ రథయాత్ర

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శుక్రవారం జగన్నాథ రథయాత్రను వైభవంగా నిర్వహించారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఒడిశా చైర్ ఆధ్వర్యంలో జగన్నాథ కల్చర్ అండ్ చైతన్య ఫిలాసఫీ రీసెర్చ్ సెంటర్ నుంచీ ఈ కార్యక్రమం ముందుకు సాగింది. సంస్కృత వర్సిటీ నుంచీ నగరంలోని ప్రధాన మార్గాల్లో జగన్నాథ రథయాత్ర సాగింది. జగన్నాథుని కృప జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంపైనా, భక్తులపైనా ఉండాలని ఇస్కాన్ మందిరం ఉపాధ్యక్షుడు రూపేశ్వర్ చైతన్య ప్రభు కోరుకున్నారు. సంస్కృత యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటనారాయణరావు ఉత్సవమూర్తులను మోసుకొని వచ్చి జగన్నాథుని రథంపై పెట్టారు. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక జ్ఞానాన్నీ రాబోయే తరాలకు అందిస్తున్నట్లు చెప్పారు. ఒడిశా చైర్ డైరెక్టర్ జ్ఞానారంజనపండా మాట్లాడుతూ.. యూనివర్సిటీలో జగన్నాథ రీసెర్చ్ సెంటర్ ద్వారా జగన్నాథుని వైభవాన్ని ఈ తరానికి తెలియచేస్తున్నామని తెలిపారు. పూరీ తరహాలోనే సంప్రదాయబద్ధంగా తిరుపతిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు చెప్పారు.

అనుమానంతో ఆలిని చంపేశాడు

పాలసముద్రం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానం పెంచుకుని, చివరకు ఆమెను హత్య చేశాడో వ్యక్తి. ఎస్ఐ చిన్నరెడ్డెప్ప తెలిపిన వివరాల మేరకు.. పులిచెర్ల మండలం కల్లూరు గ్రామానికి చెందిన అన్నదమ్ములైన షణ్ముగం, కార్తీక్ ఆరేళ్ల కిందట పాలసముద్రం మండలంలోని తిరుమలరాజుపురం పంచాయతీ అడవికాల్వ వద్ద వ్యవసాయ భూమిని కొనుగోలు చేశారు. ఇక్కడే అన్నదమ్ములు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరిలో కార్తీక్, ప్రమీల దంపతులకు సంతానం కలగలేదు. కొన్ని రోజులుగా ప్రమీలపై అనుమానం పెంచుకున్న కార్తీక్.. మద్యానికి బానిసయ్యాడు. రెండ్రోజులుగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం మద్యం మత్తులో ఉన్న కార్తీక్ ఓ కర్ర తీసుకుని భార్య తలపై కొట్టి చంపేశాడు. ప్రమీల కొనఊపిరితో ఉందేమోనన్న ఉద్దేశంతో కార్తీక్ సోదరుడైన షణ్ముగం ఆమెను తమిళనాడు షోళింగర్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాడు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమీల మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

చిన్నారుల భవిష్యత్తుకు 'కేర్ అండ్ గ్రో'

- కుప్పంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో రూ.2.89 కోట్లతో ప్రత్యేక కార్యక్రమం
- లోపాలున్న పిల్లలపై నిపుణులతో పర్యవేక్షణ



కుప్పంలో పిల్లల వివరాలు నమోదు చేసుకుంటున్న అంగన్‌వాడీలు

చిత్తూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలోని అంగన్‌వాడీ పిల్లల మానసిక లోపాలను గుర్తించి సరి చేసేందుకు ప్రభుత్వం 'కేర్ అండ్ గ్రో' ప్రాజెక్టును ప్రారంభించింది. నియోజకవర్గంలోని 428 అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ దీన్ని చేపట్టనుండగా.. ప్రస్తుతం కొన్నింట్లో మాత్రమే ప్రారంభించారు. సీఎం చంద్రబాబు జూలై 2న కుప్పంలో పర్యటించనున్న సందర్భంగా, మిగిలిన కేంద్రాల్లోనూ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.గత ఏడాది అక్టోబరులో 25అంగన్వాడీ కేంద్రాల్లో 'కేర్ అండ్ గ్రో' ప్రాజెక్టును పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు. 1711మంది పిల్లలకు ఏఐ ఆధారిత పరీక్షలు చేశారు. వీరిలో 612మందికి ఒకటి కంటే ఎక్కువ లోపాలున్నట్లు గుర్తించారు. 39 మందికి నాలుగుకు మించి లోపాలున్నట్లు గుర్తించి, నిపుణుల వద్దకు పంపించారు. 30 రోజుల పాటు చేయాల్సిన పనుల్ని వారి తల్లిదండ్రులకు సూచించారు. శిక్షణ పొందిన ఫీల్డ్ కోఆర్డినేటర్లు ఇళ్లకు వెళ్లి లోపాలున్న పిల్లల్ని పర్యవేక్షిస్తున్నారు. వచ్చే నెల రెండో వారంలో రెండో దశ స్క్రీనింగ్ పరీక్షల్ని ప్రారంభించనున్నారు.నియోజకవర్గంలోని 428 కేంద్రాలకు మే నెలలో జియోట్యాగింగ్ పూర్తి చేశాక ఈ నెల 11, 13 తేదీల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. లోపాలున్న పిల్లల తల్లిదండ్రులకు 90కిపైగా వాట్సాప్ గ్రూపుల్ని ఏర్పాటుచేశారు. రోజూ ఆ గ్రూపుల్లో పిల్లలతో చేయించాల్సిన పనుల గురించి వీడియోలు, మెసేజ్‌లు పంపిస్తుంటారు. మాట్లాడే, అరిచే, రాసే, భావోద్వేగాలు (ఎమోషన్స్) పలికించేలా శిక్షణ ఇస్తున్నారు. ఈ ప్రాజెక్టును నిర్వహించేందుకు రూ.2.89 కోట్లను ప్రభుత్వం కేటాయించింది.

ప్రాజెక్టు పురోగతి వివరాలు

- మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు: 428
- కేర్ అండ్ గ్రో ప్రాజెక్టును ప్రారంభించిన కేంద్రాలు: 134
- మొత్తం చిన్నారులు: 21,093
- స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నవారు: 1516
- లోపాలున్నట్లు గుర్తించిన చిన్నారులు: 612
- ఒక లోపం ఉన్నవారు: 317
- రెండు లోపాలు: 166
- మూడు లోపాలు: 90
- నాలుగు కంటే ఎక్కువ లోపాలున్నవారు (నిపుణులకు సిఫార్సు చేయబడ్డవారు): 39

రెండు రోజుల్లో 8230 మంది ఇళ్లకు రేషన్

తిరుపతి(నేరవిభాగం), జూన్ 27(ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చాక రేషన్ షాపుల్లోనే కార్డుదారులకు సరుకులు పంపిణీ చేస్తున్నారు. దివ్యాంగులు, వృద్ధులకు మాత్రం నిర్ణీత రోజుల్లో ఇళ్ల వద్ద చేరుస్తున్నారు. ఈ క్రమంలో జూలై నెల సరుకులను గురువారం నుంచే వీరికి ఇళ్ల వద్ద అందజేస్తున్నారు. ఇలా గురు, శుక్రవారాల్లో జిల్లాలో 8230 మందికి ఇళ్ల వద్దకు రేషన్ సరకులు తీసుకెళ్ళి డీలర్లు పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 6,61,534 మంది కార్డుదారులు ఉండగా.. దివ్యాంగులు, 60 ఏళ్ళు పైబడిన వారు దాదాపు 61,561 మంది ఉన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం

తిరుపతి(ఆర్టీసీ), జూన్ 27(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరులో జరగనున్న తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు మెరుగైన సేవలు అందించి విజయవంతం చేద్దామని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.చెంగల్‌రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన విజయవాడ ప్రధాన కార్యాలయం నుంచి డీపీటీవో జగదీష్, డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, సీఎంఈ బాలాజీ, ఇతర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు చేపట్టిన చర్యలు, పెండింగ్ పనులు, ప్రణాళికలపై ఆరాతీశారు. వీలైనంత ఎక్కువ మంది భక్తులను ఆర్టీసీ బస్సుల్లోనే తిప్పేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.బస్సుల మరమ్మతులు సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు.

మూడు కార్లు, లారీ ఢీ



ఒకదాన్నొకటి ఢీకొన్న కార్లు, లారీ

తడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మూడు కార్లు, ఓ లారీ ఒకదాన్నొకటి వెనుక నుంచి ఢీకొన్న ఘటన తడ మండలం చేనిగుంట వద్ద శుక్రవారం జరిగింది. నెల్లూరు - చెన్నై జాతీయ రహదారిపై తడ మండలం చేనిగుంట వద్ద పనులను జరుగుతుండడంతో బారికేడ్ పెట్టారు. దీనిని గమనించని ఓ కారు డ్రైవరు అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న రెండు కార్లు ఢీకొన్నాయి. ఆ కార్లను మరో లారీ కూడా ఢీకొంది. ఈ ప్రమాదంలో నాలుగు వాహనాలూ స్వల్పంగా దెబ్బతిన్నాయి. ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాలేదు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ గోదాము కూల్చివేశారని ఫిర్యాదు

తడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తమ గ్యాస్ గోదామును కూల్చివేశారంటూ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తడలోని బోడిలింగాలపాడు శివాలయం ఎదురుగా సుభాషిణి గ్యాస్ ఏజెన్సీకి గోదాము ఉంది. ఆ స్థలం విషయమై వివాదాలు ఉన్నాయి. గురువారం అర్ధరాత్రి కొందరు వ్యక్తులు ఎక్స్‌కవేటర్ సాయంతో గోదామును నేలమట్టం చేశారు. దీంతో సదరు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గోదాములో సుమారు రూ.10 లక్షల విలువైన సిలిండర్లు ఉన్నాయని, గోదాము నేలమట్టం చేసినవారే వాటిని ఎత్తుకెళ్లి ఉంటారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మా బాధలు కలెక్టర్‌కు చెప్పుకుంటాం

సామూహిక సెలవు ఇవ్వండి
పంచాయతీ కార్యదర్శుల వినతి



ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

నాయుడుపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు సామూహిక సెలవు మంజూరు చేయాలంటూ శుక్రవారం సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయంలో తగినంత సిబ్బంది లేకపోవడంతో పనిఒత్తిడికి లోనవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయాన్నే 6గంటలకు మస్టర్లకు హాజరు కావడంతో పాటు, విధుల నిర్వహణ నిర్ణీత కాలంలో చేయాల్సి వస్తోందన్నారు. శనివారం జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ బాధలు చెప్పుకునేందుకు వీలుగా కార్యదర్శులందరికీ సెలవుల మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో గోవిందయ్య, గోపాల్, రమేష్, భారతి, సత్యనారాయణ పాల్గొన్నారు.

పనిభారం తగ్గించండి



మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్యదర్శులు

కోట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పనిభారం తగ్గించాలని కోరుతూ శుక్రవారం కోట మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్యదర్శులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీకి ఒక బిల్ కలెక్టర్ పోస్టును మంజూరు చేయాలన్నారు. అదే విధంగా గ్రీవెన్స్ కార్యక్రమాలను సంబంధిత శాఖకు చెందిన వారే చూసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఐవీఆర్ఎస్ కాల్స్ కార్యాలయ పనివేళల్లో మాత్రమే నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎంపీడీవో దిలీప్ కుమార్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు.

ఊనుగుంటపాళెం సహకార సంఘానికి జాతీయస్థాయి గుర్తింపు

కోట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఊనుగుంటపాళెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి జాతీయస్థాయిలో గుర్తింపు లభించిందని ఆ సంఘ సీఈవో శ్రీనివాసులురెడ్డి శుక్రవారం తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘంగా అప్‌గ్రేడ్ చేస్తూ నేషనల్ కోఆపరేటివ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ సర్టిఫికెట్ మంజూరు చేయడం జరిగింది. ఈ గుర్తింపు వల్ల మండలంలోని రైతులు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం ద్వారా అందే సదుపాయాలు, పథకాలను పొందవచ్చన్నారు.

టీచర్ల దాతృత్వం...!

విద్యార్థులకు తొలగిన ప్రయాణ కష్టాలు



ఆటోలో వెళుతున్న విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

చిల్లకూరు, జూన్ 27: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేది ఉపాధ్యాయులేనన్నందుకు చిల్లకూరు ప్రధాన ప్రాథమిక పాఠశాలలోని ఉపాధ్యాయులు నిదర్శంగా నిలుస్తున్నారు. మండల కేంద్రమైన ప్రధాన ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 24 మంది విద్యార్థులు స్థానిక డానియల్ చిల్డ్రన్స్ హోంలో ఉంటున్నారు. వారు ప్రతి రోజూ పాఠశాలకు వచ్చి వెళ్లాలంటే ప్రధాన రహదారి మీదుగా ఒకటన్నర కిలోమీటరు దూరం ప్రయాణించాల్సి వస్తోంది. విద్యార్థుల ఆర్థిక ఇబ్బందులను గమనించిన ఉపాధ్యాయులు సుందరరాజ, నీరజ, శైలకుమారి, హరితా కుమారి, పుష్పలత సొంత ఖర్చుతో ఆటో ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఉదయం పాఠశాలకు వచ్చి సాయంత్రం తరగతులు పూర్తి కాగానే నుంచి చిల్డ్రన్స్ హోంకు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఉపాధ్యాయులను స్థానికులతో పాటు విద్యాశాఖ ఉన్నతాధికారులు అభినందించారు.

లాడ్జిలో వ్యభిచారంపై కేసు

నాయుడుపేట టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ లాడ్జీలో వ్యభిచారం నిర్వహిస్తుండడంతో శుక్రవారం తనిఖీలు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. లాడ్జీ యజమానిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నేడు జగన్నాథ రథయాత్ర

సూళ్లూరుపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో సూళ్లూరుపేటలో శనివారం జగన్నాథ రథయాత్ర నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లన్నింటినీ పూర్తి చేశారు. సూళ్లూరుపేటలోని షార్ బస్టాండు వద్ద మధ్నాహ్నం 2:30 గంటలకు ప్రారంభమయ్యే రథయాత్ర షార్ వై జంక్షన్ మీదుగా ఫ్లై ఓవర్, జీఎన్‌టీ రోడ్డుకు చేరుకుని బజారు వీధుల గుండా చెంగాళమ్మ ఆలయ వద్దనున్న శ్రీనగర్ కాలనీలో ముగుస్తుంది. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి జగన్నాథ రథయాత్రను జయప్రదం చేయాలని ఇస్కాన్ టెంపుల్ ప్రతినిధులు పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తడ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు పనుల కారణంగా శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తడ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ మురళి తెలిపారు.

టీడీపీలో కష్టపడేవారికి సముచిత స్థానం: విజయశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట, నాయుడుపేట టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడేవారికి సముచిత స్థానం కల్పిస్తామని సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. నాయుడుపేట పట్టణం శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు సమీపంలోని శ్రీనివాస మినీ ఫంక్షన్ హాల్లో శుక్రవారం ఓజిలి మండల టీడీపీ అధ్యక్ష ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంస్థాగత ఎన్నికలకు విచ్చేసిన వందలాది టీడీపీ కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటడం కాయమని అన్నారు. సీఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తూ, టీడీపీ కార్యకర్తల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని చెప్పారు. నియోజకవర్గ పరిశీలకుడు శివప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని గ్రామ కమిటీ అధ్యక్షుల నుంచి వివరాలను తీసుకుని పార్టీ అధిష్టానానికి పంపుతామన్నారు. అదే సమయంలో ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా కార్యకర్తల అభిప్రాయం తీసుకోవడం జరుగుతుందన్నారు. నెల్లూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు ఐక్యమత్యంగా పనిచేయాలన్నారు. అనంతరం ఓజిలి మండలంలోని గ్రామ కమిటీ నాయకుల అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. కాగా, 30 ఏళ్లగా పార్టీ జెండా మోసిన తకు న్యాయం చేయకుండా వైసీపీ నుంచివచ్చిన వారికి ప్రాధాన్యం కల్పిచడం ఏమిటిని ఆవేదన వ్యక్తం చేశారు. సమావే శంలో టీడీపీ వాణిజ్య విభాగ రాష్ట్ర కార్యదర్శి రాజేశ్వరరావు, నియోజక వర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, రాపూరు పరిశీలకుడు రత్నయ్య పాల్గొన్నారు.

టీడీపీ పటిష్ఠతే లక్ష్యంగా కమిటీల ఏర్పాటు: నెలవల



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

పెళ్లకూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీని గ్రామస్థాయి నుంచి పటిష్ఠ పరిచే లక్ష్యంతో సంస్థాగత ఎన్నికల కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం నాయుడుపేట పట్టణంలోని శ్రీనివాస మినీ ఫంక్షన్ ఆవరణలో పెళ్లకూరు మండల టీడీపీ అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. మండల కమిటీ ఎంపికకు సంబంధించి ఇరు వర్గాలు బల ప్రదర్శన చేశాయి. టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్యకు మద్దతుగా వందలాది మంది కార్యకర్తలు తరలి వచ్చారు. అయితే సభ్యత నమోదు కార్డు ఉన్నవారిని మాత్రమే లోనికి అనుమతించారు. అనంతరం ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ పటిష్ఠమైన నాయకత్వం కోసం అధిష్టానం చర్యలు తీసుకుంటుందన్నారు. అధికారం ఉన్నా లేకున్నా పార్టీ జెండా మోసిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు శివప్రసాద్, నెల్లూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, వాణిజ్య విభాగ రాష్ట్ర కార్యదర్శి రాజేశ్వరరావు, రాపూరు పరిశీలకుడు రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



కలెక్టర్ వెంకటేశ్వర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. శుక్రవారం తిరుపతిలో కలెక్టర్‌ను కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో పలు పాఠశాలలను విలీనం చేయడంతో కొన్ని గ్రామాల విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. సమీప పాఠశాలల్లో విలీనం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే చెరువుకట్టను ఆధునికీకరించడంతో పాటు వాకింగ్ ట్రాక్, పార్కు వంటి సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సునీల్ కుమార్ కోరారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

వెంకటగిరి టౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని యూపీహెచ్‌సీ డాక్టర్ రాజేష్ అన్నారు. శుక్రవారం పూలే పాఠశాల హాస్టల్, బాలికల ఉన్నత పాఠశాల హాస్టల్‌ను ఆయన పరిశీలించారు. చుట్టుపక్కల పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. టైర్లు, కొబ్బరి చిప్పలు, చెత్త నిల్వలు లేకుండా చూడాలన్నారు. అనంతరం డ్రైనేజీ కాలువను పరిశీలించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సత్యా, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

గూడూరు అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సరస్వతీ శిశుమందిరంలో విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మయూరి శ్యామ్‌యాదవ్ మాట్లాడుతూ పేదవిద్యార్థులను ప్రోత్సహించేందుకు ఎన్ఆర్ఐలు నిరీష, నిష్య, నివ్య ప్రోత్సాహక బహుమతులను అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మురళీరెడ్డి, వెంకటరమణయ్య, సనత్ కుమార్‌రెడ్డి, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన కార్మికుడి మృతి

పెళ్లకూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నేపల్లి వద్దనున్న అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో ఈనెల 24న జరిగిన గ్యాస్ లీకవడంతో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన జూరాల్ యాదవ్(47) తీవ్రంగా గాయపడ్డాడు. చెన్నైలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు.

అనుమతి లేకుండా బోరు డ్రిల్లింగ్

అడ్డుకున్న అధికారులు

కోట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కోటలోని అంబేడ్కర్ ఎస్సీ గురుకుల కళాశాల సమీపంలో ఉన్న పంటకాలువలో అనుమతి లేకుండా బోరు డ్రిల్లింగ్ చేస్తున్నారని నీటిపారుదలశాఖ అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో బోరు డ్రిల్లింగ్ పనులను శుక్రవారం నిలిపివేసినట్లు నీటిపారుదలశాఖ ఏఈ మునిరత్నం తెలిపారు.

నేత్రదానం



షణ్ముగం (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వహిస్తున్న నేత్రదానం 468కి చేరింది. సూళ్లూరుపేట పట్టణంలోని సాయినగర్‌కు చెందిన పెరిబేడి షణ్ముగం (64) మరణానంతరం ఆయన కుటుంబ సభ్యుల అంగీకారంతో నేత్రాలను దానం చేశారు. సేకరించిన కార్నియాలను చెన్నై శంకర నేత్రాలయకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వాహకులు చంద్రబాబు, ఆలపాటి అశోక్‌కుమార్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హెలెన్ కెల్లర్ జయంతి



హెలెన్ కెల్లకు నివాళులర్పిస్తున్న ఎస్‌పీఆర్‌టీ సేవాసంస్థ అధ్యక్షురాలు శాంతకుమారి, భవిత కేంద్ర సిబ్బంది

సూళ్లూరుపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని భవిత కేంద్రంలో శుక్రవారం అంధుల ఆశాజ్యోతి హెలెన్ కెల్లర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎస్‌పీఆర్‌టీ సేవాసంస్థ అధ్యక్షురాలు నాదెండ్ల శాంతకుమారి ఆధ్వర్యంలో భవిత కేంద్రంలో హెలెన్ కెల్లర్ చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భవిత ఉపాధ్యాయురాలు భార్గవి, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, సిబ్బంది సూర్యకుమారి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

గోకులకృష్ణ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సీఈవో బ్రహ్మయ్య, ప్రిన్సిపాల్ సురేష్, అధ్యాపకులు

సూళ్లూరుపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని గోకులకృష్ణ ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. డిప్లమో మొదటి సంవత్సరం చదువుతున్న ఆరుగురు విద్యార్థులు ఎస్‌బీటీఈ పరీక్షల్లో 9 జీపీఏ కంటే ఎక్కువ సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ ముచ్చకాల సురేష్ తెలిపారు. శుక్రవారం కళాశాల సీఈవో బ్రహ్మయ్య, ఏవో మనోహర్ అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించి సత్కరించారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు

గూడూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక రెండో పట్టణ పరిధిలోని ఎస్ఆర్‌పీ ట్యాకీస్ సెంటర్‌లో ట్రాఫిక్ ఆంక్షలను అమలు పరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ఒకటో పట్టణం నుంచి రెండో పట్టణంకు వచ్చే శాంతినగర్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందన్నారు. ప్రజల అసౌకర్యాన్ని గుర్తించిన ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని సూచించారన్నారు. దీంతో ఒకటో పట్టణం నుంచి రెండో పట్టణానికి వెళ్లే వాహనాలు శాంతినగర్ అండర్ బ్రిడ్జి ద్వారా యధావిధిగా వెళతాయన్నారు. గాంధీనగర్, మాళవ్యానగర్ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు ఎస్ఆర్‌పీ ట్యాకీస్ మీదుగా పాత సంతరోడ్డు నుంచి అంబేడ్కర్‌నగర్ రైల్వే అండర్ బ్రిడ్జి, చెన్నూరు వైపు నుంచి వచ్చే వాహనాలు పాత సంతరోడ్డు మీదుగా అంబేడ్కర్ నగర్ రైల్వే అండర్‌బ్రిడ్జి మీదుగా ఒకటో పట్టణంలోకి రాకపోకలు సాగించేలా శుక్రవారం నుంచి ఆంక్షలను అమలు పరుస్తున్నామన్నారు. వాహనదారులు సహకరించాలని కోరారు.

దామరగుంట కాలనీకి దారి ఏర్పాటు



గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దారు, టీడీపీ నేతలు

కోట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణ పరిధిలోని దామరగుంట గిరిజన కాలనీలో శుక్రవారం అధికారులు, టీడీపీ నాయకులు పర్యటించారు. గత కొన్నేళ్లుగా ఈ కాలనీకి దారిలేక గిరిజనులు ఇబ్బందులుపడుతున్నారు. కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు తహసీల్దారు జయజయరావు, సర్వేయర్లు ఆ కాలనీని సందర్శించారు. పట్టాభూములను కొనుగోలు చేసి దారి ఏర్పాటు చేసేందుకు రైతులతో చర్చించారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, ఎంపీటీసీ దారా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి



కోటమ్మ గుడికాలనీలో పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

కోట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకన్నపాళెం ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. పలు కాలనీల్లో పర్యటించిప్రభుత్వం అందించే పథకాలు, పాఠశాలలో వసతులను వివరించారు. పిల్లలను ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రభాకర్, ఉపాధ్యాయులు మహ్మద్ రఫీ, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన యువకుడి ఆచూకీ లభ్యం

కోట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని జయరామ్‌నగర్‌లో నివాసం ఉంటూ అదృశ్యమైన ముఖేష్ ఆచూకీ లభ్యమైనట్లు ఎస్ఐ పవన్ కుమార్ శుక్రవారం తెలిపారు. కోట నుంచి పరారైన ముఖేష్ ముంబాయిలోని ఓ దుకాణంలో ఉన్నట్లు తెలిసిందని, రెండు రోజుల్లో ఇంటికి తీసుకు వస్తామని ఎస్ఐ చెప్పారు.

పారిశుధ్యం పట్ల శ్రద్ధ చూపాలి



వాకాడు బీసీకాలనీ సమీపంలో చెత్తసేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసులు

వాకాడు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలుతుండటంతో పారిశుధ్యం పట్ల శ్రద్ధ చూపాలని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఆయన వాకాడు బజారువీధిలో పారిశుధ్య పనులను పరిశీలించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో గ్రామాలను శుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. అనంతరం మండలంలోని నిడిగుర్తి సచివాలయాన్ని సందర్శించారు. పంచాయతీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఈవోపీఆర్‌డీ ఉమామహేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ప్రవళిక ఉన్నారు.

ఈవీఎంల గోడౌన్ తనిఖీ

రేణిగుంట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పాత విమానాశ్రయం సమీపంలోని ఈవీఎంల గోడౌన్‌ను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్, రాజకీయపార్టీల ప్రతినిధుల సమక్షంలో త్రైమాసిక తనిఖీ చేశారు. శుక్రవారం సాయంత్రం ఈవీఎంల గోడౌన్‌లోని పరికరాలను పరిశీలించారు. గోడౌన్‌లో భద్రపరిచిన, ఈవీఎం యంత్రాలు, బీయూలు, సీయూలు, వీవీ ప్యాట్‌లను, భద్రత ఏర్పాట్లను, సీసీ కెమెరాలు, సీలింగ్ తదితరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఈవీఎం గోడౌన్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. కార్యక్రమంలో ఈవీఎం గోడౌన్ ఇన్‌చార్జి, ఎస్‌డీసీ సుధారాణి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ప్రసాద్, తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



గోడౌన్‌లో ఈవీఎం యంత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్







సీజేఎఫ్ఎస్ భూముల్లో కల్కిట్రస్టు భూమి పూజ చేసిన దృశ్యం - తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు, గ్రామస్తులు

ప్రభుత్వ భూమిలో కల్కిట్రస్టు భూమిపూజ

తహసీల్దార్‌కు గ్రామస్తుల ఫిర్యాదు

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలారివెట్టు గ్రామంలో దళితులకు చెందిన సీజేఎఫ్ఎస్ భూముల్లో వేసిన లేఅవుట్‌లో కల్కి ట్రస్టు వారు శుక్రవారం భూమి పూజ చేయడంపై తలారివెట్టు, వేణుగోపాలపురం గ్రామస్తులు, మండల టీడీపీ అధ్యక్షుడు సుధాకర్ నాయుడు తహసీల్దార్ శ్రీదేవికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో వరదయ్యపాళెం మండలంలోని ఆ పార్టీ నాయకులు, కల్కి ట్రస్టు వారు తలారివెట్టు పంచాయతీలోని సర్వే నెంబర్లు 117, 130, 131, 135, 136 లోని 14.90 ఎకరాల సీజేఎఫ్ఎస్ భూములను దళితులకు తక్కువ ధర చెల్లించి కొనుగోలుచేసి, ప్రభుత్వం నుంచి అధిక ధర చొప్పున వసూలు చేసుకున్నారని ఆరోపించారు. అదేవిధంగా ఈ భూముల్లో వరదయ్యపాళెం మండలంలోని వైసీపీ నాయకులు, వారి అనుచరులకు ఇంటి పట్టాలు ఇచ్చారని చెప్పారు. మండలంలోని తలారివెట్టు, కల్లివెట్టు, వేణుగోపాలపురం పంచాయతీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీలు ఇంటి పట్టాలకు అర్హులైన వారు ఉన్నప్పటికీ వారిలో ఏ ఒక్కరికీ ఇవ్వలేదన్నారు. మండలానికి సంబంధించిన భూమిని వరదయ్యపాళెం మండల వాసులకు ఇవ్వడం ఏమిటని వారు ప్రశ్నించారు. ప్రభుత్వ భూముల్లో కల్కి ట్రస్టు వారు భూమి పూజ చేయడం ఎంత వరకు సమంజసమని అన్నారు. ఈ భూములను తక్షణం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని, కల్కి ట్రస్టుపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ భూమిపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.